వరంగల్ వార్త
వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు
సోమవారం 08, జూన్ 2026 16 పేజీలు



# చిరుజల్లులతో రైతుల చిరునవ్వులు

-చేప ప్రసాదం సర్వరోగ నివారిని
-నేటితో మృగశీర కార్తె ప్రారంభం
-వ్యవసాయ పనులను ప్రారంభించనున్న రైతులు

2లో...

# అంపశయ్యపై ఐటీడీఏ




**10కి పైగా కీలక అధికారుల పోస్టులు ఖాళీ**

ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త,జూన్ 7 : ఏటూరునాగారం ఐటిడిఏ 50 వసంతాలు ఓడిలో ఉన్న ఆదివాసీల అభివృద్ధికి ఏర్పడిన ఆ ఐటిడిఏ లక్ష్యం శూన్యంగా ఉంది.విద్యా,వైద్యం,సామాజిక అవసరాలు నేటికీ కలగానే మిగిలాయి.గిరిజనుల అభ్యున్నతి,విద్యా ప్రగతి, ఆరోగ్య పరిరక్షణ, ఉపాధి కల్పన,మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఏటూరునాగారం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడీఏ) ప్రస్తుతం తీవ్ర అధికారుల కొరతతో సతమతమవుతోంది.గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వెన్నెముకగా నిలవాల్సిన ఈ సంస్థ నేడు ఖాళీ కుర్చీలతో, సిబ్బంది కొరతతో, నిర్వీర్యమైన పరిపాలనతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది.10 కి పైగా కీలక అధికారుల పోస్టులు ఖాళీ.ఐటిడిఏ లో 10 కి పైగా కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- అధికారులు లేక పరిపాలనకు పక్షవాతం
- ఆదివాసీల సంక్షేమంపై అధికారులకు చిత్తశుద్ధి లేదా..
- ఆదివాసీల సమస్యల ఫైళ్లకు మోక్షం లేనట్లేనా
- గిరిజనుల గోడు వినేవారు ఎవ్వరు
- వేల కోట్ల నిధులని ప్రచారం..
- సంక్షేమ పథకాల అమలుకు పర్యవేక్షణ కరువు..
- పర్యవేక్షించే అధికారులు మాత్రం శూన్యం




2లో..



# రత్నాలలో.. రహస్య మీటింగ్

2లో..

- అధికార పార్టీ కార్యకర్తల్లో అంతర్ మధనం
- భూతులెవల్ అభ్యర్థుల్లో గంధరగోలం
- ఇరువర్గాల నేతల నడుమ అధిపత్య పోరు
- కట్టర్లను కాదని కన్వర్టర్లకు అవకాశాలు

వరంగల్ బ్యూరో జూన్ 7 ప్రభాతవార్త

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుండి నిత్యం అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. తాజా మాజీ మంత్రులు కొండ వర్సెస్ బస్వరాజు నువ్వా నేనా అన్న చందంగా వ్యవహారం నడుస్తోంది. ఆవులు కొట్లాడుకుంటే దూడల కాల్లు విరిగినట్టు కార్యకర్తలు నష్టపోతూనే ఉన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇంకనూ పదవుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. మూడు దశాబ్దాలుగా పార్టీ కండువా మోస్తున్న కార్యకర్తలు నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బూతు లెవెల్ అభ్యర్థుల ఎంపికపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



2లో...

# కార్మిక వ్యతిరేక విధానాల వల్లనే సింగరేణి కి నష్టాలు

**జాతీయ బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి**



## అంపశయ్యపై ఐటిడిఏ

### మొదటి పేజీ తరువాయి..

ఏపీఓ స్థాయి పోస్టుతో పాటు పలు విభాగాధిపతుల పోస్టులు కూడా ఖాళీగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. గిరిజన సంక్షేమం, విద్య, ఆరోగ్యం, ఇంజినీరింగ్, పరిపాలన వంటి కీలక విభాగాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని తెలుస్తోంది. ఒకప్పుడు గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ పాలనకు ప్రతీకగా నిలిచిన ఐటిడీఏ కార్యాలయం ఇప్పుడు అధికారుల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో పరిపాలన పూర్తిగా కుంటుపడింది. గిరిజనుల సమస్యలు పరిష్కారం కాక నెలల తరబడి పెండింగ్‌లో ఉండిపోతుండగా, అభివృద్ధి కార్యక్రమాల అమలు కూడా మందగించింది. ఖాళీ పోస్టులను భర్తీ చేయక పోవడంతో ఒకే అధికారి రెండు మూడు విభాగాల బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోందని సమాచారం. దీంతో పరిపాలనా వ్యవస్థపై అదనపు భారం పడటమే కాకుండా పనుల నాణ్యత కూడా దెబ్బతిం టోందని ఉద్యోగ వర్గాలే గుసగుసలాడుతున్నాయి.

**ఆదివాసీల సమస్యల ఫైళ్లకు మోక్షం లేనట్లేనా...?**

కార్యాలయంలో టేబుళ్లు ఉన్నాయి... కుర్చీలు ఉన్నాయి... ఫైళ్లు ఉన్నాయి... కానీ వాటిని పరిశీలించి నిర్ణయాలు తీసుకునే అధికారులు లేక ఫైళ్లు దుమ్ము పట్టే పరిస్థితి నెలకొంది. గిరిజన గ్రామాల అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, బిల్లులు, అనుమతులు, పరిపాలనా నిర్ణయాలు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయని తెలుస్తోంది. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందించే వారు లేక నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ క్రమంలోనే ప్రతి సోమవారం జరిగే గిరిజన దర్బార్ కి ఆదరణ తగ్గుతుంది. గిరిజన విద్యపై తీవ్ర ప్రభావం..ఐటిడీఏ పరిధిలో వందలాది ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లు కొనసాగుతున్నాయి. వేలాది మంది గిరిజన విద్యార్థులు ఈ సంస్థలపై ఆధారపడి విద్యను అభ్యసిస్తున్నారు. అయితే పర్యవేక్షణ అధికారుల కొరతతో విద్యా సంస్థల నిర్వహణపై ప్రభావం పడుతోందని తెలుస్తోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల సమస్యలు, విద్యార్థుల సంక్షేమం, హాస్టళ్ల నిర్వహణ వంటి అంశాలపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరగాల్సి ఉన్నా, అధికారుల కొరత కారణంగా అది సాధ్యం కావడం లేదని సమాచారం. సంక్షేమ పథకాలకు దిక్కెవరు..?ప్రభుత్వం గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. భూ అభివృద్ధి, స్వయం ఉపాధి, వ్యవసాయ ప్రోత్సాహకాలు, గృహనిర్మాణం, విద్యా సహాయం, ఆరోగ్య పథకాలు వంటి అనేక కార్యక్రమాలు ఐటిడీఏ ద్వారా అమలవుతున్నాయి. అయితే వాటి అమలును పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంతో పథకాల ఫలాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**డిప్యూటేషన్ అధికారులతో ఎంతకాలం నెట్టుకొస్తారు..?**

రెగ్యులర్ నియామకాలు చేపట్టకుండా డిప్యూటేషన్ అధికారులతోనే వ్యవస్థను నడిపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు బదిలీ అయితే ఆ విభాగం పూర్తిగా స్తంభించే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు కాగితాలకే పరిమితమవుతున్నాయని, ప్రతి కొత్త అధికారి వచ్చినప్పుడల్లా వ్యవస్థ మళ్లీ మొదటి నుంచి ప్రారంభమవుతోంది. గిరిజన ప్రాంతాలపై ప్రభుత్వానికి చిన్నచూపా..?గిరిజన ప్రాంతాలు రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. ఇలాంటి ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో కీలక సంస్థలోనే పోస్టులు ఖాళీగా ఉండటం ప్రభుత్వ చిత్తశుద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. పట్టణ ప్రాంతాల్లో చిన్న పోస్టు ఖాళీ అయినా వెంటనే భర్తీ చేసే ప్రభుత్వం, గిరిజన ప్రాంతాల్లో మాత్రం నెలల తరబడి ఖాళీలను ఎందుకు పట్టించుకోవడం లేదని ఆదివాసి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. పథకాలు ఉన్న .. పర్యవేక్షణ మాత్రం శూన్యం..ప్రతి సంవత్సరం గిరిజన సంక్షేమం కోసం కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ ఆ నిధుల వినియోగాన్ని పర్యవేక్షించే అధికారులు లేకపోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు. నిధులు మంజూరు చేయడం ఒక ఎత్తయితే, వాటిని సమర్థవంతంగా వినియోగించడం మరో ఎత్తు. ప్రస్తుతం ఐటిడీఏలో నెలకొన్న పరిస్థితులు చూస్తే నిధుల వినియోగంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీల్లో పెరుగుతున్న అసంతృప్తి..!గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, రహదారుల దుస్థితి, విద్యా సమస్యలు, ఆరోగ్య సేవల లోపాలపై ప్రజలు తరచూ ఫిర్యాదులు చేస్తున్నా వాటి పరిష్కారం ఆలస్యం అవుతోందని ఆరోపిస్తున్నారు. “అధికారులు లేకపోతే సమస్యలు ఎవరు వింటారు..? వినకపోతే పరిష్కారం ఎలా వస్తుంది..?“ అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఐటిడీఏ పై ప్రత్యేక దృష్టి పెడితే తప్ప పూర్వ వైభవం వస్తుందన్నది ఆదివాసీ సంఘాల వాదన.

## రత్నాలో రహస్య మీటింగ్

### మొదటి పేజీ తరువాయి..

బూతు లెవెల్ కార్యకర్తల కోసం జరుగుతున్న సమావేశాల్లో సీనియర్లను కాదని కొత్తగా పార్టీ మారి వచ్చిన వ్యక్తులకు అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రత్నా హోటల్ లో జరిగిన రహస్య మీటింగు ఎవరికోసమన్న వాదనలు వినిపిస్తున్నాయి. చిన్న పదవుల నుంచి పెద్ద పదవుల వరకు అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు నష్టం జరుగుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల వ్యవసాయ మార్కెట్ పదవుల్లో జెండా మోయని కార్యకర్తకు అవకాశం ఇవ్వడం కార్యకర్తలు గరంగా ఉన్నట్టుగా కనిపిస్తుంది. గుడి బడి పార్టీ పదవుల్లో సీనియర్లకు అన్యాయం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ వీడడమా అధిష్టానానికి ఫిర్యాదు చేయడమా అన్న చర్చలు వినిపిస్తున్నాయి. ఆధిపత్య పోరులో పార్టీకి నష్టం జరుగుతుందని పార్టీ అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధిష్టానం చొరవ తీసుకోకపోతే రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీకి భారీ నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

## చిరుజల్లులతో రైతుల చిరునవ్వులు



**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:**

చిరుజల్లులతో వర్షాలు పులకరిస్తున్న వేళ రైతు ఆనందానికి అవదులు ఉండవు. మృగశీర కార్తె ప్రారంభంతో రైతులు తమ వ్యవసాయ పనులను ప్రారంభించి పులకరించిపోతారు. గత మూడు నెలలుగా మండుటెండలో మగ్గిన ప్రజలు మృగశీర కార్తె ప్రారంభంతో కాస్త ఉపశమనం పొందుతారు. మృగశీర కార్తె ప్రారంభం సందర్భంగా రైతులు ఏరువాక సాగిస్తే భూమి అగ్గిబరాటాల తాకిడి తగ్గి భూతల్లి మెల్లగా సల్లబడడంతో మాడిన రైతు మోకాలు ఒక్కసారిగి చిగురిస్తాయి. మృగశీర రోజున విత్తనాలు నాటితే పంట మంచిగ వస్తదని రైతులు నమ్మకం.

**-చేపప్రసాదం పంపిణీ:**

మృగశీర కార్తెను పురస్కరించుకొని చేపమందును తీసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. చేప మందు సర్వరోగ నివారిని అని ముఖ్యంగా ఉబసం ఉన్న వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. హైద్రాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రభుత్వం ఉచితంగా ఈ చేపమందును పంపిణీ చేయనున్నారు. బత్తిని గౌడ్ కుటుంబం గత 176ఏళ్లుగా ఈ చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇది ప్రధానంగా ఉబసం, శ్వాసకోస సమస్యలు ఉన్న వారికి బతికున్న కొర్రమీను చేపపిల్ల నోట్లో పసుపు మూలిక పెస్ట్ పెట్టి మింగిస్తారు. దీంతో ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి శాశ్వతంగా నయం అవుతుంది. శాఖాహారులకు బెల్లం ప్రసాదంతో ఇస్తారు.

**-మృగశీర కార్తెరోజు నాన్‌వెజ్ తినడం ఆనవాయితీ:**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మృగశీర కార్తె రోజున మాంసం తినడం ఆనవాయితీగా వస్తుంది. ఈ రోజు చేప మాంసం తినడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని ప్రజలు నమ్మకం. దీంతో చేపలు, మటన్, చికెన్ లకు భారీగా ధరలు పెరిగే అవకాశం ఉంది.

**-వ్యవసాయ పనులు ప్రారంభించనున్న రైతులు:**

రోహిణి కార్తె ముగింపు తర్వాత ప్రారంభమయ్యే మృగశీర కార్తె ప్రారంభం సందర్భంగా రైతులు తమ వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. దీంతో రైతులు తమ తమ వ్యవసాయ భూముల్లో నాగలితో కొంతమేర దున్నడం, విత్తనాలు వేయడం తదితర వ్యవసాయ పనులను ప్రారంభిస్తారు. వ్యవసాయ పనుల ప్రారంభంతో రైతుల మోహాల్లో ఆనందం వెల్లివిరియనుంది.




## అధికారులు సకాలంలో హాజరు కావాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం, జూన్ 7 ప్రభాతవార్త:**

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ భద్రాచలం కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## బాల, బాలికలు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనపర్చాలి

### స్పెషల్ బ్రాంచ్ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్

**కొత్తగూడెం టౌన్, జూన్ 7 ప్రభాతవార్త**



జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో త్రీ ఇంక్లైన్ లోని తెలంగాణ క్రీడమైదానంలో 40 రోజుల పాటు కొనసాగిన రెజ్లింగ్ వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. పరిసర ప్రాంతాలకు చెందిన 50 మంది బాల, బాలికలు ఈ రెజ్లింగ్ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనగా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన బాల,బాలికలకు జిల్లా స్థాయిలో వివిధ కేటగిర్లలలో రెజ్లింగ్ పోటీలను నిర్వహించి సత్తా చాటిన అత్యంత ప్రతిభ కనబరిచి బాల, బాలికలు గెలుపొందగా వారికి పతకాలను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాల, బాలికలంతా చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని బాల, బాలికలు, యువతీ, యువకులు క్రీడల్లో రాణించి ప్రభుత్వం కల్పిస్తున్న ఉన్నత విద్యరిజర్వేషన్, ఉద్యోగ రిజర్వేషన్లు పొంది మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే క్రీడల్లో కూడా ప్రతిభ కనబరుస్తూ రాష్ట్ర జాతీయ స్థాయిలో పతకాలు గెలుపొంది జిల్లా ఖ్యాతిని చాటాలని సూచించారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, రెజ్లింగ్ వేసవి శిక్షణ శిబిరం ఇంచార్జ్ పెదపాటి కాశీ హుస్సేన్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో త్రీ ఇంక్లైన్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఈసం ప్రవళిక, ఉప సర్పంచ్ పాల్తీయ లక్ష్మి, జిల్లా ఇండియన్ స్టైల్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బరిగెలభూపేష్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆదినారాయణ, గుగులోతు కృష్ణ, బోడ గణేష్, పలువురు కోచ్ లు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**బాధిత గిరిజన యువకులను పరామర్శించిన కులసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్**



మహాముత్తారం, జూన్ 07, ప్రభాతవార్త

మహాముత్తారం మండలం నిమ్మగూడెం గ్రామానికి చెందిన భూక్యా నరేష్, భూక్యా సురేష్ లపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఫారెస్ట్ అధికారులపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని కుల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్ డిమాండ్ చేశారు. నిమ్మగూడెం గ్రామంలో దాడికి గురై చికిత్స పొందుతున్న బాధితులను జేఏసీ నాయకులతో కలిసి ఆయన ఆదివారం పరామర్శించారు. గత ఆదివారం భూక్యా నరేష్ తన సొంత భూమిని చదును చేసుకోవడానికి వెళ్లగా, నిమ్మగూడెం బీట్ ఆఫీసర్ శ్రీకాంత్, రెడ్డిపల్లి బీట్ ఆఫీసర్ అఖిల్ రెడ్డిలు అక్కడికి చేరుకుని గిరిజన యువకులపై కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారని పీక కిరణ్ ఆరోపించారు. యువకులను చంపాలనే ఉద్దేశంతోనే వారి మెడపై నొక్కి, రహస్యాంగాలపై, కాళ్లపై బూట్లతో తొక్కారని మండిపడ్డారు. నరేష్‌ను కాపాడటానికి వచ్చిన సురేష్‌పై కూడా సదరు అధికారులు దారుణంగా దాడి చేశారని, వారి దాడికి యువకులు స్పృహతప్పి పడిపోగా పక్క చేలల్లో ఉన్న రైతులు వచ్చి విడిపించారని తెలిపారు. తీవ్రంగా గాయపడి లేవలేని స్థితిలో ఉన్న బాధితులను గ్రామస్తులు, పోలీసులు కలిసి అంబులెన్స్ ద్వారా భూపాలపల్లిలోని 100 పడకల ఆసుపత్రికి తరలించారని, దీనికి గ్రామస్తులంతా ప్రత్యక్ష సాక్షులని కిరణ్ పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున దాడి జరిగినా నేటి వరకు ఫారెస్ట్ అధికారులపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తక్షణమే సదరు అధికారులపై హత్యానేరం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి, వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు వెంటనే న్యాయం చేయకుంటే జిల్లా ఎస్పీతో పాటు ఎస్సీ ఎస్టీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని కిరణ్ హెచ్చరించారు. గిరిజన యువకులపై అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలను సహించేది లేదన్నారు. పరామర్శ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ అజ్మీరా పూల్ సింగ్ నాయక్, జిల్లా కోఆర్డినేటర్ రామగిరి రాజు, మండల కోఆర్డినేటర్ పుల్యాల సురేష్, వావిళ్ల సడవలి, గోల్కొండ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.




## జిల్లాలో భారీ నిషేధిత అంబర్ గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులపై నిర్వహించిన తనిఖీలలో భాగంగా భూపాలపల్లి మండలం ఖాసింపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ వద్ద నుండి అంబర్ (అనార్ బ్రాండ్) గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 6 సంచుల్లో, ఒక్కో సంచిలో 200 ప్యాకెట్ల చొప్పున మొత్తం 1,200 ప్యాకెట్లు లభించగా, వాటి విలువ సుమారు రూ.1,92,000/గా అంచనా వేయబడిందన్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రాయం పొందిన అనంతరం, నిందితుడిని మరియు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ ఉంచడం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## కేజీబీవీ కాటారంలో అడ్మిషన్ల సందడి

**7వ తరగతి, ఇంటర్ ఎంపీసీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం**

**ఏడో తరగతిలో 20 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 25 సీట్లు ఖాళీ**



కాటారం, జూన్ 7, ప్రభాతవార్త

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పలు తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ చల్ల సునీత ఆదివారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తి గల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. 7వ తరగతి మొత్తం 20 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మొత్తం 25 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంపీసీ విభాగంలో చేరాలనుకునే విద్యార్థినులు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. కాటారం కేజీబీవీ విద్యాలయం ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ గా ఎంపికైందని, దీనివల్ల విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందుతాయన్నారు. ఇంటర్ చదివే విద్యార్థినుల కోసం ప్రత్యేకంగా జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్ష నీట్ ఉచిత శిక్షణను కూడా ఇక్కడ అందించడం జరుగుతుందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ సీట్లను ఇటీవల విడుదలైన టీజీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఫలితాల మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారన్నారు. ఆరో తరగతిలో ప్రవేశాలను కూడా ప్రవేశ పరీక్ష ద్వారానే భర్తీ చేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. 7వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థినుల తల్లిదండ్రులు వెంటనే కాటారం కేజీబీవీ విద్యాలయానికి వచ్చి సంప్రదించాలని లేదా దరఖాస్తులు సమర్పించాలని ప్రిన్సిపాల్ చల్ల సునీత విజ్ఞప్తి చేశారు.

## చెక్కపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

**100 మంది చిన్నారులకు వైద్య సేవలు**

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

వేములవాడ రూరల్ మండలం లోని చెక్కపల్లి గ్రామంలో వేము లవాడ సింధు పిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ శిబిరంలో నీలోఫర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ శిశు వైద్య నిపుణురాలు డాక్టర్ సింధు (ఎండీ పీడియాట్రిక్స్) పాల్గొని సుమారు 100 మంది చిన్నారు లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చారు. అనంతరం వారికి అవసరమైన మందులు, టానిక్స్ ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదల, సమయానికి వ్యాక్సినేషన్ చేయించుకోవాల్సిన అవసరం, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని డాక్టర్ సింధు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని చెక్కపల్లి సర్పంచ్ అడ్డిక లక్ష్మీ ్మ శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ కాదాసు అనిల్ ప్రారంభించారు.

## రామగిరి హార్టికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్

రామగిరి ప్రభాతవార్త:

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీలో లోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ హార్టికల్చర్ (పాలిటెక్నిక్) కోర్సుల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆదివారం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. ప్రణీత్ కుమార్ తెలిపారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ కళాశాలలో ప్రవేశాలకు పాలి సెట్ 2026 లేదా ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం నిర్దేశించిన నిబంధనలు, మెరిట్ ఆధారంగా ప్రవేశ ప్రక్రియ చేపడతామని తెలిపారు. దరఖాస్తు ఫారాలు ఇతర వివరాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని వెల్లడించారు. పూర్తిగా నింపిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాల ప్రతులతో కలిసి చివరి తేదీ జూలై 5, 2026 సాయంత్రం 4 గంటలలోపు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ, ములుగు రోడ్, సిద్దిపేట జిల్లా - 502279, తెలంగాణ చిరునామాకు పంపాలని తెలిపారు. వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని, అలాగే 94926 50276 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## కాళోజి సాహిత్య పురస్కారానికి ఎంపికైన రాజు

చందుర్తి / ప్రభాతవార్త

చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ జాతీయ కవి, బహుభాషావేత్త, రచయిత, గేయకవి, అనువాదకుడు డా. పెరుక రాజు సాహిత్య రంగంలో అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన "కాళోజి సాహిత్య పురస్కారం 2026" కు ఎంపికయ్యారు. సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో డా. పెరుక రాజు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు, కూలీ, రైతు కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగిన డా. పెరుక రాజు ప్రస్తుతం దేశ రక్షణ శాఖ ఆర్మీ విభాగంలో జూనియర్ అధికారి హోదాలో సేవలందిస్తున్నారు. జాతీయ కవిగా, గేయకవిగా, రచయితగా, అనువాదకుడిగా అనేక భారతీయ భాషల మధ్య భావాలను, సంస్కృతులను అనుసంధానిస్తూ విశేష కీర్తిని సంపాదించారు. సాహిత్యంతో పాటు సామాజిక సేవలోనూ ఆయన విశేష కృషి చేస్తున్నారు. పేద అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం "మై గిఫ్ట్" అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవలందిస్తూ, "ప్రోత్సహించడమే మై గిఫ్ట్" అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నారు. ఈ ఏడాదిలోనే డా. పెరుక రాజు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవడంతో పాటు అనేక గౌరవాలను సొంతం చేసుకున్నారు. ఆంగ్ల పత్రికల్లో రోజువారీ ఆర్టికల్స్ రాస్తూ సాహిత్య చింతనను మరింత విస్తరిస్తున్నారు. డా. పెరుక రాజు కు లభించిన ఈ గౌరవం ఆయన సాహిత్య ప్రతిభకు మాత్రమే కాకుండా జాతీయ విలువలు, సామాజిక బాధ్యత, సాంస్కృతిక సమైక్యత పట్ల ఆయనకున్న అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుందని సాహితీవేత్తలు పేర్కొన్నారు. సాహితీ మిత్రులు, అభిమానులు, "మై గిఫ్ట్" సభ్యులు, గ్రామ ప్రజలు వివిధ రంగాల ప్రముఖులు డా. పెరుక రాజును అభినందించారు.

## మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

చందుర్తి / ప్రభాతవార్త:

చందుర్తి మండలంలో చందుర్తి, ఎన్గల్, ఆశీరెడ్డిపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం తెలిపారు, ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి కృసి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు, మిగతా గ్రామాల్లో కూడా నాలుగైదు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకోవడం జరుగుతుందని బొజ్జ మల్లేశం తెలిపారు.

## భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమే శ్వర స్వామి ఆల యాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆల యానికి వచ్చిన ఎమ్మె ల్యేకు ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ ఈవోలు జి.శ్రావణ్ కుమార్, జి.అశోక్ కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణకు ఇక నాలుగు డబ్బాలు....

.రాజపేట, జూన్ 7: ప్రభాతవా

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు గ్రామపంచాయతీలు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నాయి. ఇకపై ఇంటింటి నుంచి వచ్చే చెత్తను నాలుగు వేర్వేరు డబ్బాల్లో సేకరించేలా చర్యలు చేపడుతున్నారు. ఈ విధానం ద్వారా తడి, పొడి, ప్లాస్టిక్, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించనున్నారు. ప్రస్తుతం చాలా చోట్ల అన్ని రకాల వ్యర్థాలను ఒకే చోట వేయడం వల్ల చెత్త నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనివల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు రీసైక్లింగ్ ప్రక్రియ కూడా ప్రభావితమవుతోంది. ఈ సమస్యలకు పరిష్కారంగా నాలుగు డబ్బాల విధానాన్ని అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. కొత్త విధానం ప్రకారం ఆకుకూరల అవశేషాలు, ఆహార పదార్థాల మిగులు వంటి తడి చెత్తను ఒక డబ్బాలో, కాగితాలు, గుడ్డలు, ఇతర పొడి వ్యర్థాలను మరో డబ్బాలో వేయాలి. ప్లాస్టిక్ వస్తువులను ప్రత్యేక డబ్బాలో, బ్యాటరీలు, బల్బులు, ఇతర ప్రమాదకర వ్యర్థాలను మరో డబ్బాలో వేయాల్సి ఉంటుంది. ఈ విధానం అమలుతో చెత్తను సులభంగా వర్గీకరించి రీసైక్లింగ్‌కు పంపించవచ్చని అధికారులు చెబుతున్నారు. తడి చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీకి అవకాశం ఉండగా, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగానికి ఉపయోగించవచ్చు. దీంతో చెత్త పరిమాణం తగ్గి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందనుంది. గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి ఇంటి వారు చెత్తను సరైన డబ్బాల్లో వేస్తే గ్రామాలు మరింత పరిశుభ్రంగా మారడంతో పాటు స్వచ్ఛ గ్రామాల లక్ష్యం సాకారం అవుతుందని పేర్కొంటున్నారు. నాలుగు డబ్బాల విధానం విజయవంతమైతే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త నిర్వహణలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# గురువులే నా జీవితానికి మార్గదర్శకులు

రాజాపేట జూన్ 7 ప్రభాతవార్త

మనిషి జీవితంలో తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువులు జీవితానికి దిశానిర్దేశం చేస్తారని తుర్కపల్లి మండలం దేవోజ్ తండాకు చెందిన ఉపాధ్యాయురాలు ధీరవత్ రజిత అన్నారు. తన జీవితంలో గురువులు శేఖర్ సార్, నిర్మల మేడమ్ పాత్రను గుర్తు చేసుకుంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తుర్కపల్లి మండలం దేవోజ్ తండాకు చెందిన ధీరవత్ మోతీరం, ధీరవత్ శాంతి దంపతుల కుమార్తె అయిన రజిత మారుమూల గ్రామంలో జన్మించి పెరిగారు. సాధారణ కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికీ ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగారు. 2024 డీఎస్సీ లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి ప్రస్తుతం రాజాపేట మండలం లక్ష్మక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. బొమ్మలరామారం మండలం కందిళ్లకుంట తండాకు చెందిన శ్రీనుతో ఆమె వివాహం జరిగింది. భర్త ప్రోత్సాహం సైతం సెల్యూట్ చేస్తుంది. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ, "ముందుగా నా తల్లిదండ్రులు ధీరవత్ మోతీరం, ధీరవత్ శాంతి గారికి పాదాభివందనాలు. నన్ను కన్నది వారు



అయినప్పటికీ, నేడు నేను సమాజంలో గౌరవప్రదమైన స్థాయిలో నిలబడేందుకు కారణమైన వారు నా గురువులు శేఖర్ సార్, నిర్మల మేడమ్" అని తెలిపారు. తనలోని ప్రతిభను గుర్తించి, నాపై నాకే నమ్మకం కలిగించిన వారు తన గురువులేనని ఆమె పేర్కొన్నారు. నిరుత్సాహానికి గురైన ప్రతిసారి ధైర్యం చెప్పి లక్ష్యం వైపు నడిపించారని, ప్రతి అడుగులోనూ అండగా నిలిచి తన విజయాన్ని తమ విజయంగా భావించారని తెలిపారు. నాకు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చిన రోజు నా కంటే, నా తల్లిదండ్రుల కంటే ఎక్కువ సంతోషించింది నా గురువులే. వారి కళ్లలో కనిపించిన ఆనందం జీవితాంతం మరచిపోలేని జ్ఞాపకం" అని రజిత భావోద్వేగంతో చెప్పారు. శేఖర్ సార్ గురించి మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి చదువుకోవాలి.. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలి" అనేదే ఆయన తపన అని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ, అవసరమైన వారికి సహాయం చేయడంలో ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. స్వార్థం, కల్మషం లేని వ్యక్తిత్వంతో ఎందరో విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అదేవిధంగా నిర్మల మేడమ్ విద్యార్థుల పట్ల అపారమైన ప్రేమ, ఆప్యాయత చూపిస్తూ తల్లి మమకారంతో ప్రోత్సహిస్తారని, విద్యార్థుల విజయాలను తమ కుటుంబ విజయాలుగా భావించే అరుదైన గురువుల్లో ఆమె ఒకరని తెలిపారు. తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే, నా గురువులు నాకు జీవితాన్ని ప్రసాదించారు. వారి ఆశీస్సులు, మార్గదర్శకత్వం నా జీవితాంతం నాకు ప్రేరణగా నిలుస్తాయి. నేను కూడా ఉపాధ్యాయురాలిగా మరెందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తాను" అని ధీరవత్ రజిత పేర్కొన్నారు.

# ప్రత్యేక అవసరాలు గల పిల్లలకి భవిత కేంద్రాలు ఓ వరం..

## . లక్ష్యాలను నెరవేస్తున్న రాజపేట సెంటర్...

.. రాజాపేట, జూన్ 7 ప్రభాతవార్త

జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర శిక్ష విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న భవిత కేంద్రాలు ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాలిట ఒక గొప్ప వరంగా మారింది. . దివ్యాంగ, మానసిక శారీరక సవాళ్లు ఎదుర్కొంటున్న చిన్నారులకు సాధారణ జీవితాన్ని, నాణ్యమైన విద్యను అందించడమే ఈ కేంద్రాల ముఖ్య ఉద్దేశం. ఈ కేంద్రాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాలు, వాటిని ఉపయోగించుకునే విధానం కింద ఇవ్వబడింది. భవిత కేంద్రాల ముఖ్యమైన విషయాలు : భవిత కేంద్రాలు కేవలం చదువు చెప్పే పాఠశాలలు మాత్రమే కావు, ఇవి పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే పునరావాస కేంద్రాలు. ప్రత్యేక ఉపాధ్యాయుల పర్యవేక్షణ: ప్రతి కేంద్రంలో వైద్య విధానాలు, ప్రత్యేక బోధనలో శిక్షణ పొందిన ఐ.ఈ.ఆర్.పి, ప్రత్యేక ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారు. వీరు పిల్లల మానసిక, శారీరక స్థితిని బట్టి ప్రత్యేక బోధనా పద్ధతుల ద్వారా శిక్షణ ఇస్తారు. థెరపీ సేవలు: పిల్లల్లో శారీరక



చలనాలను మెరుగుపరచడానికి వారానికి ఒకసారి నిపుణులైన ఫిజియోథెరపిస్టుల ద్వారా ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందిస్తారు. ఫిజియోథెరపిస్ట్ రాజపేట భవిత సెంటర్కు మచ్చ స్రవంతి విశేష సేవలు అందిస్తున్నారు. అవసరమైన చోట స్పీచ్ థెరపీ (మాటల శిక్షణ) కూడా ఇస్తారు. ఉచిత ఉపకరణాల పంపిణీ: అలింకో వంటి ప్రభుత్వ సంస్థల సహకారంతో విద్యార్థుల అవసరాలకు తగ్గట్టుగా ఉచితంగా వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు ట్రై సైకిళ్లు, క్రచెస్, బ్రెయిలీ కిట్లను అసెస్మెంట్ క్యాంపుల ద్వారా పంపిణీ చేస్తారు. పాఠశాల సంసిద్ధత : తీవ్రమైన వైకల్యం



ఉన్న పిల్లలకు నేరుగా పాఠశాల వాతావరణం అలవాటు కావడం కష్టం. కాబట్టి, భవిత కేంద్రాలలో వారికి కనీస జీవన నైపుణ్యాలు (స్నానం చేయడం, బట్టలు వేసుకోవడం, తినడం వంటివి) సామాజిక నైపుణ్యాలు నేర్పి, ఆపై సాధారణ పాఠశాలల్లో చేర్పించడానికి సిద్ధం చేస్తారు. హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ : అసలు కేంద్రానికి రాలేని తీవ్రమైన వైకల్యం గల పిల్లల కోసం వారాంతాల్లో (ఉదాహరణకు శనివారాల్లో) ఐ.ఈ.ఆర్.పి లు నేరుగా వారి ఇంటికే వెళ్లి విద్యాబుద్ధులు, నైపుణ్యాలు నేర్పుతారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాలు అలవెన్సులు: భవిత కేంద్రాలలో నమోదైన విద్యార్థులకు ప్రభుత్వం పలు రకాల ఆర్థిక సదుపాయాలను కల్పిస్తుంది: అలవెన్స్ / సదుపాయంవివరాలు రవాణా భత్యం కేంద్రానికి వచ్చి వెళ్లడానికి నెలకు సుమారు ..500 అందిస్తారు. ఎస్కార్ట్ అలవెన్స్ తోడుగా వచ్చే తల్లిదండ్రులు, సంరక్షకునికి నెలకు ..550 ఇస్తారు. గర్ల్స్ స్టైఫండ్ ప్రత్యేక అవసరాలు గల బాలికల ప్రోత్సాహానికి నెలకు ..200 అందిస్తారు. రీడర్ అలవెన్స్ దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు చదివి వినిపించే వారికి రీడర్ అలవెన్స్ ఉంటుంది. స్కాలర్‌షిప్‌లు ఉన్నత తరగతుల (9 నుంచి 12వ తరగతి) దివ్యాంగ విద్యార్థులకు వార్షిక స్కాలర్‌షిప్‌లు అందుతాయి. మధ్యాహ్న భోజనం కేంద్రానికి వచ్చే పిల్లలందరికీ సమీప ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఉచిత మధ్యాహ్న భోజనం అందుతుంది. భవిత కేంద్రాలను ఉపయోగించుకునే విధానం : గ్రామంలో లేదా పరిసర ప్రాంతాలలో ఎవరైనా ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉంటే, వారిని భవిత కేంద్రంలో చేర్పించడానికి ఈ విధానాన్ని అనుసరించాలి: సమీప కేంద్రాన్ని గుర్తించడం మండల పరిధిలోప్రతి మండల కేంద్రంలో, ఒక ముఖ్యమైన ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో భవిత కేంద్రం ఉంటుంది. స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని, మండల విద్యాధికారిని సంప్రదించి కేంద్రం ఎక్కడుందో తెలుసుకోవచ్చు. ఐ.ఈ.ఆర్.పి ల సంప్రదింపు ప్రాథమిక పరిశీల నకేంద్రంలోని ప్రత్యేక ఉపాధ్యాయుడిని కలిసి బాపతు గల బాబు/పాపను చూపించాలి. వారు ఆ పిల్లాడికున్న సమస్య (వినికిడి లోపం, దృష్టి లోపం, బుద్ధిమాంద్యం, అంగవైకల్యం లేదా ఆటిజం) ఏంటో ప్రాథమికంగా అంచనా వేస్తారు. సదరం సర్టిఫికెట్ నమోదు ప్రభుత్వ గుర్తింపు కొరకు పిల్లల వైకల్య శాతాన్ని ధృవీకరించే సదరం సర్టిఫికేట్, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను భవిత కేంద్రంలో సమర్పించి పేరు నమోదు చేసుకోవాలి. (సదరం సర్టిఫికేట్ లేకపోతే ఐ.ఈ.ఆర్.పి లు క్యాంపుల ద్వారా ఇప్పించడానికి సహాయం చేస్తారు). సౌకర్యాలు, శిక్షణ పొందడం రోజువారీ ప్రణాళిక పేరు నమోదు పూర్తయ్యాక, పిల్లల మానసిక స్థితిని బట్టి వారిని రోజువారీ క్లాసులకు, వారానికి కొన్ని రోజులు థెరపీల కోసం కేంద్రానికి తీసుకురావచ్చు. తీవ్రత ఎక్కువగా ఉంటే హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ కోసం ఉపాధ్యాయులను కోరవచ్చు. ముఖ్య గమనిక: ప్రభుత్వం నిర్వహించే మెడికల్ అసెస్మెంట్ క్యాంపుల ద్వారా ఈ పిల్లలకు ఉచితంగా జైపూర్ కాళ్లు, వినికిడి మిషన్లు అందడమే కాకుండా, శస్త్రచికిత్సలు అవసరమైన పిల్లలను గుర్తించి ఆరోగ్యశ్రీ, సర్వశిక్షా నిధులతో ఉచితంగా ఆపరేషన్లు కూడా



చేయిస్తారు. తల్లిదండ్రులు ఓపికతో, నమ్మకంతో భవిత కేంద్రాల సేవలను ఉపయోగించుకుంటే, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కూడా సమాజంలో తమ కాళ్లపై తాము నిలబడగలిగేలా ప్రయోజకులవుతారు. లక్ష్య సాధన దిశగా రాజాపేట : రాజపేట మండలంలోని భవిత సెంటర్ ప్రభుత్వ లక్ష్య సాధన దిశగా కొనసాగుతోంది. వేసవి సెలవులలో ఎంఈఓ చందా రమేష్ పర్యవేక్షణలో ఫిజియోథెరపీ పర్యవేక్షణలో జరిగింది. దివ్యాంగ విద్యార్థులకు ప్రతి సంవత్సరము అలింపు సంస్థ ద్వారా సహాయ ఉపకారణాలను అందిస్తున్నట్లు ఐ ఈ ఆర్ టి సంధ్యారాణి తెలిపారు.

## తోటి స్నేహితుల మధ్య కరాటే బాలు జన్మదిన వేడుకలు

రాజాపేట జూన్ 7 ప్రభాతవార్త

రాజాపేట మండలం రేణిగుంట గ్రామానికి చెందిన నీరటి బాల నర్సయ్య కరాటే బాలు జన్మదిన వేడుకలు చిన్ననాటి స్నేహితుల మధ్య జరిగింది. ఆదివారం మదన దుర్గమ్మ దగ్గర 1982 83 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల మధ్య ఘనంగా సంబరాలను జరుపుకున్నారు. సంబరాల్లో వారాల శ్రీనివాసు, ఎం. ఎస్. సత్యనారాయణ దాస్, గాండ్ల నరసింహారావు, ఊట్కూరి రమేష్ గౌడ్, ధర్మ మహేందర్ రెడ్డి, కె చంద్రయ్య బుడమ సత్యనారాయణ గుప్తా, తదితరులు పాల్గొన్నారు. మిత్రులందరికీ కేక్ కట్ చేయగా తోటి స్నేహితులు శాలువా పుష్పగుచ్ఛాలతో కరాటే బాలును సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## వైరల్ వార్తల ముసుగులో విషం చిమ్మితే కటకటాలే

**తప్పుడు వార్తలు ఫార్వర్డ్ చేస్తే జైలుకే**

**పసర ఎస్. ఐ. ఘూటు హెచ్చరిక**

గోవిందరావుపేట ప్రభాతవార్త

సోషల్ మీడియా చేతిలో ఫోన్ ఉంది కదా అని ఏది పడితే అది ఫార్వర్డ్ చేస్తున్నారా..? ఒక్కసారి ఆగండి. మీ ఒక్క షేర్ వల్ల ఓ కుటుంబం రోడ్డున పడొచ్చు, ఊరు అట్టుడికిపోవచ్చు. ఇక నుంచి ఖబడ్దార్ అంటూ పసర ఎస్సై తాజుద్దీన్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఒకప్పుడు వార్తలు పేపర్‌లో వచ్చేవి. ఇప్పుడు సెకనులో వాట్సాప్‌లో వాలిపోతున్నాయి. నిజమా, అబద్ధమా అని చూసే తీరిక ఎవరికీ లేదు. ఫార్వర్డ్ బటన్ నొక్కేసి చేతులు దులుపుకుంటున్నారు. ఈ నిరక్ష్యమే సమాజానికి పెద్ద జబ్బుగా మారుతోందని ఎస్సై మండిపడ్డారు. "ఏది నిజం, ఏది అబద్ధం అని ఒక్క నిమిషం ఆలోచించండి. మీ ఫోన్‌లోని ఫేక్ న్యూస్ వేరే వాళ్ల జీవితాన్ని నాశనం చేసే బాంబు లాంటిది. ఆ బాంబు పేలితే మొదట బుక్ అయ్యేది మీరే" అని ఆయన కుండబద్దలు కొట్టారు. ఇటీవల ఓ చిన్న గొడవను మత ఘర్షణగా చిత్రీకరించి వైరల్ చేసిన ఘటనను ఆయన గుర్తు చేశారు. ఆ ఒక్క వార్త వల్ల మూడు రోజులు ఊరిలో 144 సెక్షన్ పెట్టాల్సి వచ్చింది. అసలు నిజం తెలిసేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇలాంటి వాళ్లను ఉపేక్షించే ప్రసక్తే లేదు. "ఎస్సై చెప్పిన రూల్స్ ఇవే. షేర్ చేసే ముందు సోర్స్ చూడండి. అధికారిక ప్రకటన లేదా, నమ్మకమైన పత్రికల్లో వచ్చిందా లేదా చూడండి. ఖిలలానా వాళ్లు చెప్పారుఖి అనే మెసేజ్‌లు నమ్మొద్దు. అనుమానం వస్తే ఆపేయండి. నిజమో కాదో తెలియని వార్తను పోలీస్ స్టేషన్‌కు ఫార్వర్డ్ చేయండి, పది మందికి కాదు. "గ్రూప్ అడ్మిన్లు జాగ్రత్త, మీ గ్రూపులో ఎవరైనా ఫేక్ న్యూస్ పెడితే దాని బాధ్యత మీదే. మీ మీద కూడా కేసు అవుతుంది. గి చట్టం చాలా స్ట్రాంగ్: ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తే జైలు శిక్ష, జరిమానా రెండూ తప్పవు. ఖితెలియక చేశానుఖి అంటే కుదరదు. విద్యార్థులు, యువత ఫోన్‌ను చదువుకు, ఉద్యోగ ప్రయత్నాలకు వాడుకోవాలని, ఊర్లో పంచాయతీలు పెట్టే వార్తలు షేర్ చేసి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆయన హితవు పలికారు. పోలీసులు, ప్రజలు కలిసి కట్టుగా పని చేస్తేనే ఈ ఫేక్ న్యూస్ అనే వైరస్‌ను తరిమికొట్టగలం. బాధ్యతగా షేర్ చేయండి, లేదంటే జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండండి" అంటూ ఎస్సై తాజుద్దీన్ తన ప్రసంగాన్ని ముగించారు.

## రామప్ప లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వెంకటాపూర్ (రామప్ప) ప్రభాతవార్త ;;



మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయం ప్రాంగణంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయుల సమ్మేళనం నిర్వహించారు. పాలంపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1996 97 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు 30 సంవత్సరాల ఆత్మీయ సమ్మేళన నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేస్తూ తమ కష్టసుఖాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సుద్దాల సంతోష్, జనగామ రాజుకుమార్, ఆడెపు చంద్రమౌళి, పిల్లలమర్రి బిక్షపతి, శ్రీనివాస్ రజిత, శ్రీదేవి, రమ, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## చెక్కపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం

**100 మంది చిన్నారులకు వైద్య సేవలు**

వేములవాడ రూరల్ ప్రభాత వార్త:

వేములవాడ రూరల్ మండలం లోని చెక్కపల్లి గ్రామంలో వేము లవాడ సింధు పిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ శిబిరంలో నీలోఫర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ శిశు వైద్య నిపుణురాలు డాక్టర్ సింధు (ఎండీ పీడియాట్రిక్స్) పాల్గొని సుమారు 100 మంది చిన్నారు లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిం చారు. అనంతరం వారికి అవసరమైన మందులు, టానిక్స్ ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల మానసిక, శారీరక ఎదుగుదల, సమయానికి వ్యాక్సినేషన్ చేయించుకోవాల్సిన అవసరం, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

## మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన బిఆర్ఎస్ నాయకులు

ప్రభాతవార్త ఏటూరు నాగారం జూన్ 7:



మండలం లోని రొయ్యూరు సర్పంచ్ కావేరి అర్జున్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా మంత్రి సీతక్క వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అల్లంల రమేష్ యాదవ్, ఆకుదారి గంగాధర్ నేత, రెడ్డి మహేష్, ఆకుదారి సూర్యనారాయణ, మంగపేట మండలానికి చెందిన డాక్టర్ దుర్గం నరేంద్రబాబు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల ఆదరణ పొందుతోందని అన్నారు.

## గాండ్ల కుల జిల్లా అధ్యక్షునిగా పిల్లలమర్రి శ్రీనివాస్



ములుగు జిల్లా అఖిల గాండ్ల తెలికుల సంఘం(ఏ జీ టీ ఎస్) జిల్లా అధ్యక్షునిగా నర్సాపూర్ గ్రామానికి చెందిన పిల్లలమర్రి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పాలంపేట గ్రామంలో గల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం, యునెస్కో గుర్తింపు పొంది ప్రముఖ క్షేత్రంగా విరాజిల్లుతున్న రామప్ప దేవాలయం గార్డెన్ లో జిల్లా కులస్తులందరూ సమావేశమై జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. (ఏ జి టి ఎస్) రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొల్లెపల్లి అన్నపూర్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి రాము ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో గాండ్ల కుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా గనిశెట్టి రాజు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా సర్వ వెంకయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల అభివృద్ధి కోసం తమ శాయా శక్తుల కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లలమర్రి శివ, సతీష్, సమ్మయ్య, భద్రయ్య శ్రీనివాస్ ,బిక్షపతి, సర్వ సాంబయ్య ,రాజు, శివుడు, శీలం ఉమా, స్రవంతి. జగదాంబ, స్వరూప, హాసిని, అక్షయ్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే

వేములవాడ, ప్రభాతవార్త:

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమే శ్వర స్వామి ఆల యాన్ని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆల యానికి వచ్చిన ఎమ్మె ల్యేకు ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ ఈవోలు జి.శ్రావణ్ కుమార్, జి.అశోక్ కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్‌పై సమరశంఖం

**గాంధీనగర్‌లో నిషేధం విధించిన సర్పంచ్ నిర్మల వెంకన్న**

గోవిందరావుపేట ప్రభాతవార్త



బాల్య వివాహ రహిత గ్రామంగా ఇప్పటికే పేరుగాంచిన గాంధీనగర్ ఇప్పుడు ప్లాస్టిక్ మహమ్మారిపై యుద్ధం ప్రకటించింది. ఆదివారం తెల్లవారుజామున 7 గంటలకు గ్రామ సర్పంచ్ బానోత్ నిర్మల వెంకన్న స్వయంగా చీపురు పట్టి రోడ్డెక్కారు. యువకులు, మహిళలు, కమిటీల నాయకులతో కలిసి గ్రామంలోని ప్రతి వీధినీ జల్లెడపట్టి ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి డంపింగ్ యార్డుకు తరలించారు. ప్లాస్టిక్ వద్దు, భవిష్యత్తు ముద్దు అనంతరం గ్రామ కూడలిలో జరిగిన సభలో సర్పంచ్ నిర్మల వెంకన్న హెచ్చరికలతో కూడిన ప్రకటన చేశారు. "ఇక నుంచి మా గ్రామంలో ప్లాస్టిక్ వాడకం నిషిద్ధం. కవర్లు, గ్లాసులు, బాటిళ్లు ఏదైనా సరే ప్లాస్టిక్ కనిపిస్తే సహించేది లేదు. మా పిల్లల ఊపిరిని, మా భూమి సారాన్ని ప్లాస్టిక్‌కు బలిచేయం" అని తెగేసి చెప్పారు. "బాల్య వివాహ రహిత గ్రామంగా అధికారుల చేత శభాష్ అనిపించుకున్నాం. ఆ స్ఫూర్తితోనే ఇప్పుడు ప్లాస్టిక్ రహిత గ్రామంగా మారుస్తున్నాం. మాటలు కాదు చేతల్లో చూపిస్తాం. గాంధీనగర్ అంటే ఆదర్శం అని మళ్లీ నిరూపిస్తాం" అని ఆమె స్పష్టం చేశారు. !!!ఏకతాటిపై యావత్ గ్రామం"ఈ ఉద్యమంలో ఉపసర్పంచ్ వల్లపు మహేష్, వార్డు సభ్యులు మాలోత్ శంకర్, కూరాకుల సురేష్, రామావత్ సంధ్యా బిక్షపతితో పాటు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బానోతు వెంకన్న, ఆరోగ్య కమిటీ అధ్యక్షులు ఐలయ్య, వాటర్ కమిటీ అధ్యక్షుడు కిరణ్, విద్యా కమిటీ అధ్యక్షులు బెల్లి సురేష్, పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు బానోత్ ఖాసీం సహా గ్రామ పెద్దలు, బాలవికాస ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది భుజం కలిపారు. ఒకప్పుడు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నిలబడిన గాంధీనగర్, ఇప్పుడు ప్లాస్టిక్‌పై సమరం ప్రకటించి ములుగు జిల్లాకే దిక్సూచిగా మారింది. "కఠిన ఆంక్షలు తప్పవ్, గ్రామంలో ఇకపై దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు ఇస్తే, బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ పడవేస్తే కఠిన చర్యలు తప్పవని కమిటీలు హెచ్చరిస్తున్నాయి. బదులుగా గుడ్డ సంచులు, స్టీల్ గ్లాసుల వాడకాన్ని ప్రోత్సహించనున్నారు. "ఇది ఒక్కరోజు హడావిడి కాదు. ఇది ప్రతిజ్ఞ. ప్లాస్టిక్ లేని గాంధీనగర్‌ను నిర్మిస్తాం" అని గ్రామస్తులు నినదించారు.

## జిల్లాలో భారీ నిషేధిత అంబర్ గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

ప్రభాతవార్త ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న నిషేధిత పొగాకు ఉత్పత్తులపై నిర్వహించిన తనిఖీలలో భాగంగా భూపాలపల్లి మండలం ఖాసింపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ యూసుఫ్ వద్ద నుండి అంబర్ (అనార్ బ్రాండ్) గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 6 సంచుల్లో, ఒక్కో సంచిలో 200 ప్యాకెట్ల చొప్పున మొత్తం 1,200 ప్యాకెట్లు లభించగా, వాటి విలువ సుమారు రూ.1,92,000/గా అంచనా వేయబడిందన్నారు. స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అభిప్రాయం పొందిన అనంతరం, నిందితుడిని మరియు స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ ఉంచడం, రవాణా చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## మూడు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

చందుర్తి / ప్రభాతవార్త:

చందుర్తి మండలంలో చందుర్తి, ఎన్గల్, ఆశిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం తెలిపారు, ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి కృషి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు, మిగతా గ్రామాల్లో కూడా నాలుగైదు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకోవడం జరుగుతుందని బొజ్జ మల్లేశం తెలిపారు.

# అంగన్వాడీలలో నాణ్యమైన పోషకాహారం తప్పనిసరి

**జిల్లా ఆహార భద్రతాధికారి సునీత**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి: జూన్ 07, ప్రభాతవార్త:**



అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా ఆహార భద్రతాధికారి సునీత స్పష్టం చేశారు. ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్వాడీ ఉపాధ్యాయులకు ఆహార భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ, సమాజంలో చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమన్నారు. ఆహార నాణ్యత, భద్రతా ప్రమాణాలపై అంగన్వాడీ ఉపాధ్యాయులకు పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.




**పరిశుభ్రత, పోషక విలువలకు ప్రాధాన్యం**

అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఆహార పదార్థాల నిల్వ, వంట తయారీలో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని ఆమె సూచించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడం ద్వారా రక్తహీనత, పౌష్టికాహార లోపం వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు.

**నిరంతర పర్యవేక్షణ**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన ఆహార నియమాలు అమలయ్యేలా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని సునీత వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి అవగాహన కార్యక్రమాల ద్వారా జిల్లాను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి వినూత్న, అంగన్వాడీ టీచర్లు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యాన్ని తక్షణమే తరలించి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**వేమనపల్లి, జూన్ 07, ప్రభాతవార్త:**

కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే తరలించి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చూడాలని మంచిర్యాల జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లాలోని కోటపల్లి మండలం దేవులవాడ,వేమనపల్లి మండలం గొర్లపల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో, దస్నాపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ జిల్లాలో కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఈ క్రమంలో కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని త్వరితగతిన కేటాయించిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించి కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన వరి ధాన్యం తరలింపు కొరకు అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం వేమనపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి



అధికారులతో కలిసి వరి ధాన్యం తరలింపునకు కావలసిన రవాణా సౌకర్యానికి సంబంధించిన కార్యాచరణ పరిశీలించి, రవాణా గుత్తేదారులతో చరవాణి ద్వారా మాట్లాడి అదనపు లారీలను కేటాయించాలని, రానున్న వర్షాకాలం దృష్ట్యా కొనుగోలు చేసిన వరి ధాన్యం యుద్ధ ప్రాతిపదికన ఈరోజు రాత్రి కల్లా తరలించి జిల్లాలో కొనుగోలు ప్రక్రియ ముగిసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోనరావుపేటలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా ఆవిష్కరణ

**ప్రభాత వార్త కోనరావుపేట:**



తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు కోనరావుపేట మండల కేంద్రంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సీనియర్ నాయకుడు నూనె మల్లేష్ యాదవ్, మండల ఇంచార్జ్ కులేరు వినయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేములవాడ నియోజకవర్గ అబ్జర్వర్ ఎత్తరి మారయ్య, నియోజకవర్గ ఇంచార్జ్ వరద సతీష్ కుమార్, సంకెపల్లి సుమలత సుధాకర్ శర్మ, గుంటుక సంపత్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ ప్రవేశపెట్టిన "పాంచజన్యం"లో భాగంగా ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచిత కరెంట్, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేస్తామని తెలిపారు.రాబోయే రోజుల్లో పార్టీకి ప్రజాదరణ మరింత పెరుగుతుందని, ప్రజలు పార్టీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తోట కనకయ్య, సాలెంద్ర నవీన్, లక్కం సతీష్, సాయి ప్రణీత్, బయికడి ఆంజనేయులు, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల రమేష్, కదిరే భాస్కర్, జావీద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన జగిత్యాల విద్యార్థులు

**విద్యార్థులను అభినందించిన కరీంనగర్ కమీషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ అలామ్**

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

జగిత్యాల జిల్లా కు చెందిన నలుగురు విద్యార్థులు కరాటే లో సత్తాచాటి బ్లాక్ బెల్ట్ సాధించారు.కరీంనగర్ లోని వివేకానంద రెసిడెన్సియల్ స్కూల్ లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీల్లో జగిత్యాల ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రధాన శిక్షకుడు మర్రిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఎస్.చక్రి ,కె. సాయి చరణ్, బి. సామిత్ రాజ్, కె. చైతన్య విశేష ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ కైవసం చేసుకున్నారు.ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ చీఫ్ ఎగ్జామినర్ కే వసంత్ కుమార్ బ్లాక్ బెల్ట్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్ లను ప్రధానం చేశారు.బ్లాక్ బెల్ట్ సాధించిన జగిత్యాల విద్యార్థులను కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌస్ అలం ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని ముఖ్యంగా యువత వ్యసనాలకు అలవాటు కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని అమ్మాయిలు ఆత్మ రక్షణ విద్య కరాటే తప్పనిసరిగా నేర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ మరిపెల్లి లింగయ్య, ఎంఏ మన్నన్, అనంతుల కాంతారావు, నరేష్,రాజశేఖర్,సంతోష్,రాము,తదితరులు పాల్గొన్నారు.



## విద్యా బోధనకు దరఖాస్తులకు ఆహ్వానం

**చందుర్తి / ప్రభాతవార్త:**

ప్రాథమిక పాఠశాలలో పూర్వ బోధకుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానించినట్లు మండల విద్యాధికారి వినయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో నూతనంగా మంజూరైన నాలుగు ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.ఎన్గల్, నర్సింగాపూర్,జోగాపూర్, సనుగుల పాఠశాలలో బోధించడానికి మహిళా బోధకులు,ఆయాల నియామకానికి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. పూర్వ ప్రాథమిక బోధకులకు ఇంటర్మీడియట్, లేదా దానికి సమానమైన ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్, ప్రైమరీ టీచింగ్ అర్హత కలిగి ఉండాలన్నారు. ఆయా పోస్టుల నియామకానికి ఏడవ తరగతి చదివి ఉండాలన్నారు. పోస్టుల నియామకానికి గరిష్ట వయస్సు 44 సంవత్సరాలు కాగా ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల వారికి నిబంధనల మేరకు సడలింపు అమలు చేయనున్నట్లు తెలిపారు.ఈ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు అదే గ్రామానికి చెందిన వారై ఉండాలన్నారు.దరఖాస్తులకు సంబంధించిన పత్రాలతో 9వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు మండల విద్యా వనరుల కేంద్రంలో సమర్పించాలని పేర్కొన్నారు.

## గాలి దుమారంలో పోలీసుల తక్షణ స్పందన

**రోడ్డుపై కూలిన చెట్ల తొలగింపు**

**ప్రజల భద్రతకు ప్రాధాన్యం**

**వేములవాడ రూరల్ ప్రభాత వార్త:**



వేములవాడ రూరల్ మండలంలో ఆదివారం సాయంత్రం వీచిన భారీ గాలిదుమారం కారణంగా పలుచోట్ల చెట్లు రహదారులపై కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వెంటనే వేములవాడ రూరల్ ఎస్సై వెంకటరాజం ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు.నాగయ్యపల్లి గ్రామంలో కూలిన చెట్లను తొలగించే కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేశం కూడా పాల్గొని పోలీసులతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షి ంచారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.గంటల్లోనే పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చి రహదారులను సాధారణ రాకపోకలకు అనుకూలంగా మార్చారు. గాలి దుమారం వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి సహాయక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతే తమ తొలి లక్ష ్యమని, ఎలాంటి విపత్తు వచ్చినా ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు.స్థానికులు పోలీసుల తక్షణ స్పందనను అభినందిస్తూ, చెట్లను వెంటనే తొలగించి రాకపోకలు పునరుద్ధరించడం వల్ల పెద్ద ప్రమాదాలు తప్పాయని పేర్కొన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ చింతకుంట మల్లేశం సహకారాన్ని కూడా కొనియాడారు..."ప్రజల కోసం... ప్రతి క్షణం... మీతో మేముంటాం" అనే నినాదాన్ని వేములవాడ రూరల్ పోలీసులు మరోసారి కార్యరూపంలో చూపించారు.

## బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి బోగ శ్రావణిని కలిసిన తోట్లవాయి గ్రామస్తులు

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

జగిత్యాల జిల్లా రాయికల్ మండల్ తాట్లవాయి మరియు అలియా నాయక్ తండా గ్రామ ఉప సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లు ఆదివారం బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్. బోగ శ్రావణిప్రవీణ్ ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి ఎంపీ నిధుల ద్వారా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయవలసిందిగా వినతిపత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో తాట్లవాయి ఉప సర్పంచ్ నారాయణ, అలియా నాయక్ తండా ఉపసర్పంచ్ గణేష్,అంజిత్, జి.రెడ్డి,.గంగాధర్, రాజు సంతోష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



# ముల్కనూర్ సహకార సంఘాన్ని సందర్శించిన ఐఏఎస్ శిక్షణాధికారులు

**భీమదేవరపల్లి: జూన్ 7 (ప్రభాతవార్త)**

హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీ లో శిక్షణ పొందుతున్న ఆరుగురు ఐఏఎస్ శిక్షణాధికారులు ఆదివారం ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు పరపతి సంఘాన్ని సందర్శించారు. తమ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సంఘం కార్యకలాపాలు, సభ్యులకు అందిస్తున్న వివిధ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘ ఉద్యోగులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంఘం చరిత్ర, అభివృద్ధి, సభ్యులకు అందిస్తున్న రుణాలు, వ్యవసాయ సేవలు, బీమా సేవలు, విత్తనోత్పత్తి, మార్కెటింగ్ తదితర కార్యక్రమాలను వివరించారు. అనంతరం శిక్షణాధికారులు అడిగిన పలు ప్రశ్నలకు సంఘ ఉద్యోగులు సమగ్రంగా సమాధానాలు అందించారు. ఈ సందర్భంగా ఐఏఎస్ శిక్షణాధికారులను సంఘ జిఎం రామ్‌రెడ్డి, రుణ విభాగాధిపతి రాజమోళి ఘనంగా సత్కరించారు. అనంతరం శిక్షణాధికారులు మాట్లాడుతూ ముల్కనూర్ సహకార సంఘం సామాజిక మూలధనం ద్వారా గ్రామీణ స్థాయిలో సామాజిక, ఆర్థిక మార్పులను ఎలా తీసుకురావచ్చో విజయవంతంగా నిరూపించిందన్నారు. నిబద్ధత కలిగిన నాయకత్వం, పరస్పర విశ్వాసం, అంకితభావంతో పనిచేస్తే సహకార వ్యవస్థ గ్రామీణాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ



నమూనా నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఈ నమూనాను విస్తరించే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, సీనియర్ మేనేజర్ వెంకటేశ్వరరావు, రుణ విభాగాధిపతి రాజమోళి, సంఘంలోని ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రపంచీకరణ కారణంగా సంఘటిత అసంఘటిత కార్మికుల జీవితాలు ఆగం అయ్యాయి

**ప్రభుత్వం మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**జూన్ 07, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :**

ప్రపంచీకరణ కారణంగా సంఘటిత అసంఘటిత కార్మికుల జీవితాలు ఆగం అయ్యాయని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ బిఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. స్థానిక హనుమకొండ బాలసముద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలన్లో ఆటో కార్మికులకు అండగా నిలిచారు, ఆటో కార్మికులకు 77 కోట్ల టాక్స్ లను మాఫీ చేశారు, ఆటో కార్మికులకు 5 లక్షల ప్రమాద బీమా చేయించడం జరిగింది, ఆటో అడ్డాలు ఏర్పాటు, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు లేకుండా చేశారు అని అన్నారు. కానీ కాంగ్రెస్ 2023 లో ఆటో కార్మికులకు అనేక హామీలు ఇచ్చింది కానీ ఆ హామీలు అమలు కావడం లేదు, కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ ని ఈ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం రాహుల్ గాంధీ ఎక్కడ ఎన్నికలు జరిగినా ఆటో కార్మికుల ఆటో ఎక్కారు, భోజనం చేశారు కానీ తెలంగాణాలో ఇచ్చిన హామీ అమలు మరిచారు, ఆటో కార్మికులకు ఇస్తామన్నా సంవత్సరానికి 12 వేలు ఇవ్వడం లేదు, ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదు, ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు అని అన్నారు. ఆదివారం శ్రీ చైత్యన్య ఆటో కార్మిక పరస్పర సహకార సంఘం వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకోవడం జరిగింది, వారికి నా వ్యక్తిగత



తోడ్పాటును అందించడం జరిగింది అని అన్నారు. రాబోవు తెలంగాణ ఏర్పడే బీఆర్ఎస్ ప్రభుత్వంలో సహకార, కార్మిక సంఘాల కోసం ప్రత్యేక ప్రభుత్వ పాలసీలను రూపొందిస్తాం, ఈరోజు ఆదివారం నుంచి 10 రోజుల పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని డివిజన్ వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నాం, అధికారంలో ఉన్నా ప్రజలతో ఉన్నాం ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలతోనే ఉన్నాం, ప్రజల పక్షాన పోరాడుతాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు పులి రజినీకాంత్, ఇమ్మడి రాజు, ఆటో కార్మిక సంఘం నాయకులు ఉప్పుల రాజేందర్, రామ్ చందర్, రవీందర్, సురేష్, గణేష్, రవి, సుదర్శన్, సమీర్, శరత్, నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం తో ఇక ఉండలేము...

**. హన్మకొండ బ్యూరో. జూన్ 7. (ప్రభాత వార్త.)**

హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తన అధికార బలంతో స్థానిక నాయకత్వాన్ని పూర్తిగా అణచివేస్తున్నారని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన నాయకులు లక్కిరెడ్డి తిరుపతి రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తన రాజకీయ స్వార్థం కోసం ఎదుగుతున్న నాయకులను దెబ్బతీయడమే లక్ష్యంగా మంత్రి కుట్రలు పన్నుతున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బతుకమ్మ కుంట భూమి వివాదం – అసలు ఏం జరిగింది? గత 50 ఏళ్లుగా రంగయ్యపల్లి గ్రామంలో మహిళలు బతుకమ్మ ఆడుకోవడానికి సరైన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు, గత గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో లక్కిరెడ్డి తిరుపతి రెడ్డి తన సొంత భూమిని ఖిబతుకమ్మ కుంటఖి కోసం కేటాయించారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి స్వయంగా ప్రస్తుత మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ హాజరై తిరుపతి రెడ్డి చేసిన సత్కార్యాన్ని ఎంతగానో అభినందించారు. అయితే, ఈ దాన గుణం వల్ల తిరుపతి రెడ్డికి ప్రజల్లో మంచి పేరు వచ్చి, రాజకీయంగా ఎదుగుతారనే అసూయతో మంత్రి తన వైఖరిని మార్చుకున్నారని ఆరోపించారు. ప్రస్తుత అధికార బలంతో ఆ భూమికి క్లియర్ టైటిల్ రాకుండా వెనుక నుండి అడ్డుపడుతున్నారని తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. సొంత పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలపై కుట్రలు పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నియోజకవర్గంలో స్థానిక నాయకులకు కనీస విలువ లేకుండా పోయిందని తిరుపతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "మంత్రి కుటుంబ సభ్యులే భీమదేవరపల్లి మండలాన్ని శాసిస్తూ, స్థానిక నాయకత్వాన్ని తొక్కిపెడుతున్నారు. మండలంలో ఎదుగుతున్న స్థానిక నాయకులను, చివరకు మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సైతం రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా మంత్రి వ్యూహాలు సాగుతున్నాయి. దీనిపై గత కొన్ని నెలలుగా నేను గళమెత్తినందుకే నాపై కక్షగట్టారు," అని ఆయన పేర్కొన్నారు. అధికారుల తప్పుదోవ – అక్రమ కేసుల పర్వం తాను దానం చేసిన బతుకమ్మ స్థలాన్ని గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించడానికి గత ఐదు నెలలుగా రెవెన్యూ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తిరుపతి రెడ్డి తెలిపారు. అయితే, తనకు చెడ్డపేరు తేవాలనే



కుట్రతో, రంగయ్యపల్లి గ్రామ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌ను వాడుకుని మంత్రి కావాలనే ఆ భూమిపై లీగల్ వివాదాలు సృష్టిస్తూ, జిల్లా రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. శనివారం స్వయంగా మంత్రులే తనకు ఫోన్ చేసి, సోమవారం కలిసి మాట్లాడుకుందామని చెప్పారని, కానీ అంతలోనే హఠాత్తుగా తనపై అక్రమ కేసులు బనాయించారని తిరుపతి రెడ్డి ఆరోపించారు. సొంత మండలంలో తప్పుడు కేసులతో తనను బద్నాం చేసి, రాజకీయ భవిష్యత్తును నాశనం చేయడమే మంత్రి ఏకైక అజెండా అని ధ్వజమెత్తారు. అధిష్టానానికి విన్నపం: ఖివలస నాయకులను తిరస్కరించండిఖి వలస నాయకుడైన పొన్నం ప్రభాకర్ ఆడుతున్న ఈ రాజకీయ క్రీడను, స్థానిక నాయకత్వాన్ని చంపేసే కుట్రలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వలస నాయకులకు హుస్నాబాద్ నియోజకవర్గంలో ఖచ్చితంగా ప్రజల నుండి నిరసన ఎదురవుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ఇతర రాజకీయ పార్టీలకు ఆయన ఒకటే విన్నపం చేశారు: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో స్థానికేతరులకు (వలస నాయకులకు) ఎలాంటి బీఫారాలు ఇవ్వకూడదు. కేవలం స్థానిక నాయకులకే పోటీ చేసే అవకాశం కల్పించాలి. స్థానిక నాయకులను ప్రజలు ఖచ్చితంగా గెలిపించుకుంటారు, కానీ పొన్నం ప్రభాకర్ లాంటి వలస నాయకులను మాత్రం రాబోయే రోజుల్లో ఖచ్చితంగా తిరస్కరిస్తారని ఆయన తేల్చి చెప్పారు




# భీంపల్లి గ్రామీణ వైద్యుడు వడదెబ్బతో మృతి

**కమలాపూర్: ప్రభాత వార్త.**



భీంపల్లి గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు బండారి చంద్రమోళి (48) శుక్రవారం వడదెబ్బ బారిన పడి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను హుజరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయనను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం చంద్రమోళి మృతి చెందారు. కుటుంబానికి పెద్దదిక్కైన ఆయన మరణంతో ఆ ఇల్లు శోకసంద్రంలో మునిగిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రమోళి దీర్ఘకాలంగా గ్రామంలోని ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ అందరి అభిమానం పొందారు. ఆయన మరణం పట్ల గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని, తగిన సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# మృగశిర కార్తె - విశిష్టత

**ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్. (సాయిబాబా మందిర ధర్మకర్త)**

**జూన్ 07, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్**

:తెలుగు సంప్రదాయంలో మృగశిర కార్తెకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది అని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. సాధారణంగా జ్యేష్ఠ మాసంలో వచ్చే ఈ కార్తెతో వర్షాకాలం ప్రారంభమవుతుందని రైతులు భావిస్తారు. మృగశిర కార్తె రోజున పడే వర్షాలు వ్యవసాయానికి ఎంతో మేలు చేస్తాయని నమ్మకం. అందువల్ల దీనిని రైతుల పండుగగా కూడా పరిగణిస్తారు. మృగశిర కార్తె రోజున ప్రజలు తెల్లవారుజామున స్నానం చేసి దేవునికి పూజలు చేస్తారు. ముఖ్యంగా రైతులు



తమ వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. విత్తనాలను సిద్ధం చేసుకోవడం, పొలాలను దున్నడం వంటి పనులు ప్రారంభిస్తారు. కొందరు మృగశిర కార్తె రోజున చేపలు, లేదా ప్రత్యేక ఆహార పదార్థాలు తింటే ఆరోగ్యం బాగుంటుందని విశ్వసిస్తారు. మృగశిర కార్తె ప్రకృతికి, వ్యవసాయానికి, ఆరోగ్యానికి సంబంధించిన సంప్రదాయాలను గుర్తు చేసే ముఖ్యమైన రోజు. ప్రకృతిని గౌరవిస్తూ, మంచి ఆలోచనలతో కొత్త పనులను ప్రారంభించడం ఈ రోజు ప్రధాన సందేశం, సారాంశం : మృగశిర కార్తె రైతులకు ఆశలు నింపే శుభదినం. వర్షాకాల ఆరంభానికి సంకేతంగా భావించే ఈ రోజున భక్తితో పూజలు చేసి, వ్యవసాయ పనులను ప్రారంభించడం శ్రేయస్కరం. మరొక విశేషమేమిటంటే బత్తిని సోదరులు వందల సంవత్సరాలుగా ఉబ్బసం వ్యాధి గ్రస్తులకు ఉచితంగా పంపిణీ చేసే చేపమందు నేడు హైదరాబాదును లక్షలాదిమందికి పంపిణీ చేయనున్నారు ఈ మందు కోసం దేశ విదేశాలనుండి హైదరాబాద్ చేరుకోవటం ఒక విశేషం

# నవదిన ప్రార్థనలో భాగంగా పునీత అంతోని వారికి ప్రదక్షణ

**ధర్మసాగర్, జూన్ 7 (ప్రభాతవార్త):**

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని అద్భుతాల పునీత అంతోని వారి దేవాలయంలో జూన్ 13న జరగనున్న పునీత అంతోని వారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న నవదిన ప్రార్థనల్లో భాగంగా ఆదివారం 3వ రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విచారణ గురువులు ఫాదర్ జోజి బాబు, సెంట్ జేవియర్ సెమినరీ రెక్టర్ ఫాదర్ మారపల్లి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో దివ్య సత్ప్రసాద ఆరాధన ఊరేగింపు దివ్య పూజా బలి నిర్వహించారు. 3వ వార్డు సభ్యులతో కలిసి పునీత అంతోని వారి స్వరూపాన్ని ప్రదక్షిణ నిర్వహించారు. దివ్య పూజాబలిలో గురువులు ప్రసంగిస్తూ క్రీస్తు శరీర రక్తముల పండుగ విశిష్టత, దివ్య ప్రసాదం గొప్పతనం, పునీత అంతోని వారి అద్భుతాలు మరియు వారి ఆధ్యాత్మిక సేవలను కొనియాడారు. విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొని కుటుంబాల శ్రేయస్సు, సమాజ శాంతి, సౌభ్రాతృత్వం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ భక్తులు, సంఘస్తులు, విశ్వాసులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనం అమ్మితే ఊచలు లెక్కపెట్టాల్సిందే

## రైతు ఉసురు పోసుకుంటే పీడీ యాక్ట్ తప్పదు

## మండలంలో నిఘా టైట్

## సీఐ దయాకర్, ఎస్ఐ తాజుద్దీన్ వార్నింగ్

గోవిందరావుపేట ప్రభాతవార్త..




"రైతు కష్టాన్ని నకిలీ విత్తనంతో నాశనం చేస్తే ఊరుకునేది లేదు. ఒక్క గింజ అమ్మినా జైలుకు పంపుతాం" అని పసర సీఐ దయాకర్, ఎస్ఐ తాజుద్దీన్ సంయుక్తంగా ఘాటు హెచ్చరిక జారీ చేశారు. వానాకాలం సీజన్‌లో దళారుల ఆటలు సాగనివ్వబోమని తేల్చి చెప్పారు. సీఐ దయాకర్ హెచ్చరిఇది రైతు జీవితంతో చెలగాటం. లైసెన్స్ లేకుండా షాప్ నడిపినా, కల్తీ సరుకు దాచినా క్రిమినల్ కేసే. రైతు ఫిర్యాదు చేస్తే నిందితుడిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం. కోర్టు చుట్టూ తిరిగినా బెయిల్ రాదు" అని సీఐ దయాకర్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఎస్ఐ తాజుద్దీన్ అల్టిమేటం "రాత్రి పగలు తేడా లేకుండా దాడులు చేస్తాం. గోడౌన్లు, లారీలు, షాపులన్నీ మా కంట్రోల్‌లోనే ఉన్నాయి. బిల్లు లేని విత్తనం అమ్మినా, గడువు తీరిన స్టాక్ పెట్టినా స్పాట్‌లో అరెస్ట్. రైతును మోసం చేసేవాడు మా లిస్టులో ఉంటాడు" అని ఎస్ఐ తాజుద్దీన్ తేల్చిచెప్పారు. "రైతన్నకు పోలీసుల సూచన, బిల్లు లేనిదే విత్తనం కొనవద్దు అది మీ పంటకు డెత్ సర్టిఫికెట్‌అని, లాట్ నంబర్, కంపెనీ సీల్ చెక్ చేసుకోవాలని, అనుమానం వస్తే వెంటనే 100కు డయల్ చేయాలని అన్నారు. మీ ఒక్క కాల్ దళారీ జీవితాన్ని జైలుకు మారుస్తుంది. ఆపరేషన్ క్లీన్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మండలంలోని ప్రతి ఫర్టిలైజర్ షాపును జల్లెడ పడతామని సీఐ, ఎస్ఐ ప్రకటించారు. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతామని, తేడా వస్తే షాప్ సీజ్ చేసి యజమానిని లోపలేస్తామని స్పష్టం చేశారు.

# పసరలో యాదవుల ఐక్య గర్జన

## వర్ధం చందర్ రాజ్ యాదవ్'పెద్ద గొల్ల', పాక వెంకన్న యాదవ్ 'సారే గొల్ల'గా ఏకగ్రీవం

గోవిందరావుపేట ప్రభాతవార్త



ఆదివారం కుల ఐక్యతకు నిదర్శనంగా పసర యాదవ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. వర్ధం చందర్ రాజ్ యాదవ్‌ను పెద్ద గొల్లగా, పాక వెంకన్న యాదవ్‌ను సారే గొల్లగా కుల పెద్దలు, యువకులు ముక్తకంఠంతో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పెద్ద గొల్ల వర్ధం చందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ,, "కులం కోసం కలిసికట్టుగా పనిచేస్తాం. మన హక్కుల సాధన, యువత అభివృద్ధే మా మొదటి ప్రాధాన్యత. పసర యాదవుల గొంతుకగా నిలబడతా" అని స్పష్టం చేశారు. సారే గొల్లగా ఎన్నికైన పాక వెంకన్న యాదవ్ మాట్లాడుతూ, "పెద్దల ఆశీస్సులు, యువత సహకారంతో సంఘాన్ని బలోపేతం చేస్తాం. ప్రతి యాదవ బిడ్డకు అండగా ఉంటాం. మాటలతో కాదు చేతలతో నిరూపిస్తాం" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, కుల పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి సంఘీభావం తెలిపారు.

# భూ పోరాటాలను ఉద్ధృతం చేద్దాం పేదల హక్కులపై రాజీ లేదు

గోవిందరావుపేట ప్రభాత వార్త




పేద ప్రజలకు భూమి దక్కేవరకు పోరాటం ఆపేది లేదు. రాష్ట్రవ్యాప్తంగా భూ పోరాటాలను ఉధృతం చేయాలని బి వెంకట్ స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతోంది. పేదలను పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదల బతుకులను భారంగా మార్చిందని ధ్వజమెత్తారు. ఉపాధి హామీకి ఎసరు, గత చట్టాన్ని నీరుగార్చే విధంగా ఉపాధి హామీ చట్టాన్ని మార్చి పేదల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. మత రాజకీయాలపై దాడి, మత ఉన్మాద రాజకీయాలతో కూలీలను విభజిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌పై విమర్శ, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీలన్నీ తుంగలో తొక్కింది. పేదలను మోసం చేసిందని జి నాగయ్య నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్ల మోసం, అందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్న హామీ గాలికొదిలేశారు. ఒక్క ఇల్లు కూడా సక్రమంగా ఇవ్వలేదు. పెన్షన్ హామీ బూటకం, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ ఇస్తామన్న మాట నీటి మూట అయ్యింది. ఆచరణలో శూన్యం. పోడు భూముల డిమాండ్, అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీ, గిరిజనులకు పోడు భూములకు వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలి. ఇంటి స్థలాల పోరాటం, నిరుపేదలకు ఇంటి స్థలాలు, పట్టాలు ఇచ్చే వరకు ప్రభుత్వ భూములపై ఎర్రజెండాలు ఎగురవేస్తామని హెచ్చరించారు. గిరిజనేతర రైతుల గోడు, ములుగు ఏజెన్సీలో కాస్త కబ్జాలో ఉన్న గిరిజనేతర పేద రైతులకు కనీసం పహానీ కూడా మంజూరు చేయడం లేదు. ఇందిరమ్మ ఇళ్లు గ్రామసభల ద్వారానే పారదర్శకంగా మంజూరు చేయాలి. దళారీ వ్యవస్థను నిషేధించాలి. సంక్షేమ పథకాల అమలు..: పేదలకు ఇస్తామన్న సంక్షేమ పథకాలన్నీ వెంటనే అమలు చేయాలి. లేదంటే పోరాటాలకు సిద్ధం. కావాలని అన్నారు. నూతన నాయకత్వం, అధ్యక్షులుగా బిరెడ్డి సాంబశివ, ప్రధాన కార్యదర్శిగా ఎండి దావూద్ సహా 26 మందితో నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవం ఎన్నుకోవడం జరిగింది. భవిష్యత్ కార్యాచరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృత ఉద్యమాలు. భూమి, కూలీ, ఉపాధి హక్కుల సాధన వరకు వెనక్కి తగ్గేది లేదని, గోవిందరావుపేటలో జరిగిన ములుగు జిల్లా 2వ మహాసభకు జ్ఞానం వాసు, ఎండి దావూద్ అధ్యక్షత వహించగా రైతు సంఘం, సిఐటియు, కెవిపిఎస్ నేతలతో సహా 100 మందికి పైగా హాజరయ్యారు.

# సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణానికి నూతన కమిటీ ఎన్నిక

## అధ్యక్షులుగా రసపుత్ సీతారాం నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోతు వెంకన్న ఏకగ్రీవ ఎన్నిక

గోవిందరావుపేట ప్రభాత వార్త

బంజారుల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ దేవాలయ నిర్మాణం కోసం గోవిందరావుపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ములుగు జిల్లా సేవాలాల్ ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు బానోత్ రవిచందర్ సూచన మేరకు ఆదివారం గోవిందరావుపేట మండల కేంద్రంలో బంజారా కుల పెద్దల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దేవాలయ నిర్మాణానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా రసపుత్ సీతారాం నాయక్, ప్రధాన కార్యదర్శిగా బానోతు వెంకన్న, కోశాధికారిగా భూక్య బాబురావు, ప్రచార కార్యదర్శిగా అజ్మీర అశోక్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా భూక్య సారయ్య, అజ్మీర సురేష్, భూక్య రాజులను ఎంపిక చేశారు. కోర్ర రఘురాం, లాకావత్ నరసింహ, లావుడియా జోగాలను గౌరవ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు సీతారాం నాయక్ మాట్లాడుతూ "సద్గురు సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణ బాధ్యతలు అప్పగించిన బంజారా కుల పెద్దలకు, మా జాతి బిడ్డలకు పేరుపేరునా కృతజ్ఞతలు. మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అందరి సహకారంతో ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల బంజారా సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, కుల పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# చేనేత వస్త్రాల కొనుగోలులో టెండర్ విధానం రద్దుచేయాలి

ఎడ్యుకేషన్ కేయూ, జూన్ 7 ప్రభాతవార్త :

చేనేతవస్త్రాల కొనుగోలులో ఓపెన్‌టెండర్ విధానం, ఓపెన్ మార్కెట్ విధానం రద్దుచేసి పాతపద్ధతి జీవో నెంబర్.1టెస్కో (టీజీఎస్‌సీఓ) ద్వారా చేనేత సహకార సంఘాల నుండి ఆర్డర్ల ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థలకి, పాఠశాలలకి, హాస్టల్స్‌కి, గురుకులాలకి, సొసైటీలకి చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని బీసీజాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునారి శేషు లేఖ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికులను పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోటానికి 2024లో ప్రభుత్వం జీవో నెంబర్1ని జారీచేసి చేనేత రంగాన్ని ఆదుకునే ప్రయత్నం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత వస్త్రాలను టెస్కో ద్వారా కాకుండా ఓపెన్ టెండర్ విధానం ద్వారా కొనాలని విద్యాశాఖ భావించటం వలన దరిదాపు 50వేలమంది చేనేత కార్మికులు ఉపాధికోల్పోయే ప్రమాదం ఉంది కాబట్టి చేనేత వస్త్రాల కొనుగోలు విషయంలో పాత పద్ధతినే కొనసాగించాలన్నారు. చేనేత వస్త్రాల కొనుగోలు విషయంలో పాత పద్ధతినే కొనసాగించకుండా ఓపెన్ టెండర్ విధానాన్ని అవలంబిస్తే చేనేత రంగంలో కార్మికుల ఆత్మహత్యలు మరింత పెరిగే అవకాశం ఉంది కాబట్టి విద్యాశాఖ మంత్రిగా కూడా మీరే వ్యవహరిస్తున్నారు కాబట్టి విద్యాశాఖ నిర్ణయాన్ని పునః పరిశీలన చేయవలసినదిగా చేనేత కార్మికుల పక్షాన బీసీజాక్ మీకు విజ్ఞప్తి చేస్తుందని తెలిపారు.

# పూర్వ విద్యార్థులు విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

## - రిజిస్ట్రార్ ప్రొ.వి.రామచంద్రం

ఎడ్యుకేషన్ కేయూ, జూన్ 7 ప్రభాతవార్త :

కాకతీయ విశ్వవిద్యాలయం ఎంబీఏ 2011-13 బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం కామర్స్ కళాశాల సెమినార్‌హాల్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల విజయాలు విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మరింత ఇనుమడింపజేస్తున్నాయన్నారు. వివిధరంగాల్లో వారు సాధిస్తున్న విజయాలు ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధి కార్యక్రమాల్లో పూర్వవిద్యార్థులు చురుకుగా భాగస్వాములు కావడంతోపాటు తమ జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకులుగా వ్యవహరించాలని సూచించారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహాచారి మాట్లాడుతూ, కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా వివిధ బ్యాచ్‌ల పూర్వవిద్యార్థుల సమ్మేళనాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కామర్స్ కళాశాలకు చెందిన పూర్వవిద్యార్థులు దేశ, విదేశాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆచార్య కృష్ణమాచారి, ఆచార్య సక్రియ, ఆచార్య రాజేశం, డాక్టర్ ఫణీంద్ర, డాక్టర్ ప్రగతి తదితర అధ్యాపకులు పాల్గొన్నారు. ఎంబీఏ 2011-13 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు సంతోష్, మామిడి రాజేష్, శ్రీను, సురేష్ పచ్చిమట్ల, వేణు పాల్గొన్నారు.

# తొలకరి పండగ

వెంకటాపురం అర్బన్ ప్రభాతవార్త:

ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాత్రపురం గ్రామంలో వాడబలిజ కులస్తుల తరఫున తొలకరి పండగ దానవయ్య పండుగ చేశారు. ఈ యొక్క తొలకరి పండగ లో వర్షాలు బాగా కురయాలని, పంటలు బాగా పండాలని, పాత్రాపురం గ్రామంలో ప్రజలు అందరు సుఖశాంతులతో జీవించాలని వాడ బలిజ కులస్తులు మొక్కలు చెల్లించుకున్నారు.



# కొనుగోలు కేంద్రాలనుంచి ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

## - జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

ధాన్యం కొనుగోళ్లను, రవాణాను మరింతవేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై అదనపు కలెక్టర్ బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యంకొనుగోళ్ల చివరిదశకు చేరుకున్న నేపథ్యంలో 57ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ల పూర్తయ్యాయని తెలిపారు. ప్రతీమిల్లు, కేంద్రం వారీగా కొనుగోలు వివరాలు, మిల్లులకు తరలించిన ధాన్యం



వివరాలు, అలాగే మిల్లులవద్ద ఎంత అన్లోడింగ్ పెండింగ్ ఉంది, కొనుగోలు కేంద్రాలవద్ద లోడింగ్ ప్రక్రియ, ఎన్నిలారీలు వచ్చాయి, కేంద్రాలవారీగా ఉన్న ధాన్యంనిల్వలు, అలాగే ఏకేంద్రానికి ఇంకా ఎన్నివాహనాలు అవసరమని, ప్రతి అంశంపై క్షుణ్ణంగా సమీక్షించారు. అలస్యంగా ధాన్యంవచ్చే కొనుగోలు కేంద్రాలపై మరింత పర్యవేక్షణ అవసరమన్నారు. ధాన్యంకొనుగోలు, రవాణా విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, రైతులు పండించే ప్రతీధాన్యం గింజను కొనుగోలుచేసి ట్యాగ్‌చేసిన మిల్లులకు తరలించి, ధాన్యంకొనుగోలు ప్రక్రియలో జిల్లాకు మంచిపేరు



వచ్చేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. ధాన్యంకొనుగోలు, రవాణావిషయంలో పౌరసరఫరాలు, రవాణా తదితరశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలుచేసి, ధాన్యం కొనుగోలు, రవాణా వేగవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీసీఓ కరుణ, అదనపు డీఆర్‌డీవో నూరుద్దీన్, పౌరసరఫరాల సంస్థ డీఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, డీసీఎస్‌ఓ సురేశ్‌రెడ్డి, రవాణాశాఖ అధికారి శిల్ప, వ్యవసాయశాఖ అధికారి అంబికాసోనీ ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని బాలికలహాస్టళ్లలో నాన్-టీచింగ్ పోస్టులభర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జనగామ టౌన్, జూన్ 7 ప్రభాతవార్త:

జిల్లాలోని నాలుగు టైప్-4 ఆదర్శ పాఠశాలల బాలికలహాస్టళ్లలో ఖాళీగా ఉన్న నాన్-టీచింగ్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీచేయుటకు అర్హతగల మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**- ఖాళీల వివరాలు..:**

కొడకండ్లలో - ఏఎన్ఎం ఒకపోస్టు, జఫర్‌గఢ్‌లో ఏఎన్ఎం-1, అసిస్టెంట్ కుక్ -1, వాచ్ ఉమెన్ -1 పోస్టులకు, అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ హాస్టల్‌కు కేర్ టేకర్ కం వార్డెన్-1పోస్టు, ఏఎన్ఎం- 1పోస్టు ఖాళీ ఉందగా, అదేవిధంగా బచ్చన్నపేట హాస్టల్‌లో హెడ్‌కుక్-1పోస్టు, అసిస్టెంట్ కుక్ -1పోస్టు మొత్తం నాలుగు మండలాలకు సంబంధించి 8పోస్టులు భర్తీ చేయనున్నారని ప్రకటన ద్వారా తెలిపారు. అభ్యర్థుల వయసు నోటిఫికేషన్ తేదీ నాటికి 40సంవత్సరాల లోపు మధ్య ఉండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5సంవత్సరాలు,




దివ్యాంగులకు 10సంవత్సరాల వయసు సడలింపు ఉంటుందన్నారు.

**- అర్హతలు - గౌరవ వేతనం..:**

కేర్ టేకర్ కం వార్డెన్ - డిగ్రీతోపాటు డీఈడీ/బీఈడీ అర్హత కలిగి ఉండాలని, గౌరవ వేతనం రూ.12,500 లు ఉంటుందన్నారు. అలాగే ఏఎన్ఎం - ఇంటర్మీడియట్, ఏఎన్ఎం శిక్షణ పూర్తిచేసి ఉండాలని, గౌరవ వేతనం రూ.7,800 ఉంటుందన్నారు. హెడ్‌కుక్ - 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, పెద్దసంఖ్యలో వంటచేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, గౌరవ వేతనం రూ.7,800 ఉంటుందన్నారు. అలాగే అసిస్టెంట్ కుక్ - కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, గౌరవ వేతనం రూ.6,500 ఉంటుందని తెలిపారు. వాచ్ ఉమెన్ - 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, గుర్తింపు పొందిన భద్రత సంస్థ ద్వారా శిక్షణపొందిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, వీరి గౌరవ వేతనం రూ.8,710 లు ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక స్థానికత ఆధారంగా నిర్వహించబడుతుందని, వసతి గృహానికి సమీపంలో నివసించే మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడునని పేర్కొన్నారు.

ఆసక్తిగల మహిళా అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధృవపత్రాలతోపాటు రెండుసెట్ల జిరాక్స్ ప్రతులు, ఇతర సంబంధిత ధృవపత్రాల జిరాక్స్ ప్రతులతో కూడిన దరఖాస్తులను ఈనెల10వ తేదీ సాయంత్రం 5గంటలలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, జనగామలో సమర్పించవలెనని ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

# యార్డుకు వచ్చిన ప్రతీగింజ కొనుగోలు చేశాం

## మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్

జనగామ, జూన్ 7 ప్రభాతవార్త:

జనగామ మార్కెట్ యార్డుకు వచ్చిన ప్రతీగింజ కొనుగోలు చేయడం జరిగిందని, అలాగే యార్డులో ఉన్న చీటకోడూరు ఐకేపీ సెంటర్‌లో ఆదివారం చివరిలారీని మిల్లుకు తరలించడం జరిగిందని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్‌యాదవ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లకొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు ఐకేపీ సెంటర్ నిర్వాహకులు మొత్తం



40709గోనెసంచులు, 49లారీలు, ఏడు డీసీఎంలు, 14ట్రాక్టర్లు, అన్ని కలిపి మొత్తం 204మంది రైతులకుగాను 16283.69కిలోల వడ్లు పూర్తిగా మార్కెట్‌కు వచ్చిన ప్రతీ రైతుకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు ఆదివారం పూర్తిస్థాయిలో మిల్లుకు తరలించినట్లు తెలిపారు. మార్కెట్‌కమిటీ యార్డులో వచ్చిన ప్రతీరైతుకి సరైన సమయంలో అందుబాటులో మాపాలకవర్గ సభ్యులు, అధికారులు ఐకెపిసెంటర్ నిర్వాహకులు రైతులకు లారీలు, గన్నిబ్యాగులు, టార్పిలిన్‌లు మొదలగు వాటిని అందించి ముఖ్యంగా రైస్‌మిల్లు యజమానులతో ఎపటికప్పుడు మాట్లాడి రైతుల సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. అదేవిధంగా రైతులకు సమయానికి అంటే మూడురోజులలో ప్రజాప్రభుత్వం ఆధ్వర్యంలో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ సెంటర్ నిర్వాహకులు అనిత, లావణ్య, శిరీష, విజయ, రజిత, హమాలీసంఘం రాజు, సిద్దులు, సోమయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

---

# 12న శ్రీ సిద్దేశ్వరస్వామి దేవస్థానంలో వేలంపాటలు

బచ్చన్నపేట, జూన్ 7 ప్రభాతవార్త:

బచ్చన్నపేట మండలంలోని కొడవటూరు గ్రామంలో వెలిసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ సిద్దేశ్వరస్వామి దేవస్థానంలో వలుసేవలు, అమ్మకాల హక్కులకు సంబంధించిన టెండర్ బహిరంగవేలం ప్రకటన విడుదలైంది. ఈ మేరకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి సి.వంశీ, ముఖ్య అర్చకులు, సిబ్బంది సంయుక్తంగా వివరాలను వెల్లడించారు.

రాబోయే సంవత్సర కాలానికి గాను, ఈ నెల



12వ తేదీన మధ్యాహ్నం 12గంటల నుంచి దేవస్థాన ప్రాంగణంలో సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం నిర్వహించనున్నారని తెలిపారు.

# జనగామ వార్త



# వీ.బీ. రాంజీ బిల్లును రద్దుచేయాలి



బచ్చన్నపేట, జూన్ 7 ప్రభాతవార్త:

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని బలహీనపరుస్తూ కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న వి.బి.రాంజీ బిల్లును వెంటనే రద్దుచేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జనగామ జిల్లా కార్యదర్శి సింగారపు రమేష్ డిమాండ్ చేశారు. బచ్చన్నపేట మండలకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన 7వ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ చట్టం అట్టడుగు వర్గాలు, దినసరికూలీల జీవనాధారమని, దీనిని రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. కేంద్రప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలవల్ల ఉపాధిహామీ చట్టం బలహీనపడే ప్రమాదంఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధిహామీ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పొత్కనూరు పేందర్, మండలకార్యదర్శి తాడెం రాములు తదితరులు పాల్గొన్నారు. అదే సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా భాముర్లపల్లి సంపూర్ణ, కార్యదర్శిగా తాడెంరాములు, ఉపాధ్యక్షులుగా ఇంజ ఎల్లయ్య, కుడుదల సిద్దయ్య, సహకార కార్యదర్శులుగా మానేపల్లి భూమయ్య, కంట్రాజు కిష్టయ్య కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# విద్యా-వైద్యరంగ సమస్యలపై దశలవారీగా సీపీఎం పోరాటం

జనగామ టౌన్, జూన్ 7 ప్రభాతవార్త:



విద్యా, వైద్యరంగ సమస్యలను పరిష్కరించాలని, కార్పొరేట్ విద్యాసంస్థలు వైద్య హాస్పిటల్‌లో జరుగుతున్న ఫీజుల దోపిడీ నియంత్రించి ప్రజల్ని కాపాడాలని సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా దశల వారిగా పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని దీనికిప్రజలు పెద్దఎత్తున సహకరించాలని పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఎం జిల్లాకార్యాలయంలో రాపర్తిరాజు అధ్యక్షతన జరిగిన జిల్లాకమిటీ సమావేశంలో అబ్బాస్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వస్కూల్లో ప్రభుత్వ కాలేజీలు ప్రభుత్వాలు నిర్లక్ష్యంచేసిన ఫలితంగా విద్యార్థులకు ఉచితంగావిద్యను అందించే ప్రభుత్వస్కూల్లో కాలేజీలలో కనీస సౌకర్యాలు లేకసరైన వసతులులేక ప్రభుత్వ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రవేట్ విద్యాసంస్థలలో విచ్చలవిడిగా వసూలుచేస్తున్న ఫీజులదోపిడిని నియంత్రించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు సంపాదించిన సంపాదనలో 50శాతం వరకు విద్యకు ఖర్చుచేసి కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయన్నారు. అదేవిధంగా వైద్యరంగంలో కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడంతో అనారోగ్యానికి గురైన పేదప్రజలు, ప్రైవేట్ హాస్పిటల్‌లోకి వెళ్తే కార్పొరేట్ హాస్పిటల్స్ ఇతర ప్రైవేట్ హాస్పిటల్స్ పెద్ద ఎత్తున డబ్బులువసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. ప్రవేట్ హాస్పిటల్‌లో జరుగుతున్న డబ్బులు వసూల్‌పై ప్రభుత్వాలు నియంత్రణ చేయకపోవదంతో ఇష్టారీతిన బిల్లులువేసి ప్రజలను దోపిడీ చేస్తున్నార న్నారు. ఈ సమస్యలపై జనగామ జిల్లావ్యాప్తంగా సర్వేలు నిర్వహించి వచ్చిన సమస్యలఆధారంగా దశలవారీగా ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకుపోవడం జరుగు తుందన్నారు. అదేవిధంగా కార్పొరేట్ శక్తులు ఇప్పటికైనా అధికఫీజులు వసూలుచేసే పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కనకారెడ్డి, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, బూడిదగోపి, జోగు ప్రకాష్, బెల్లంకొండ వెంకటేష్, ఉపేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులకు ఘన సన్మానం



**నర్సంపేట,జూన్ 8,ప్రభాతవార్త**

భోజ్యానాయక్ తండాలో బీఎన్‌టీ వారియర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రతిభావంతుల సన్మాన , ఫెలిసిటేషన్ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడల్లో విజయాలు సాధించిన క్రీడాకారులు, 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు పొందిన యువత, అలాగే ఉన్నత విద్యలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బీఎన్‌టీ వారియర్స్ సొసైటీ తరపున ఘనంగా సన్మానించారు. సన్మానితులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి వారి ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ యువతలో విద్య, ఉద్యోగాలు, క్రీడలు, ఉన్నత లక్ష్యాల పట్ల మరింత ప్రేరణ కలిగించేందుకు సొసైటీ కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్పి నారాయణ నాయక్, గ్రామ పెద్ద ఆజ్మీర నారాయణ నాయక్ హాజరై విద్యార్థులు, ఉద్యోగులు, క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌టీ వారియర్స్ సొసైటీ గౌరవ అధ్యక్షులు బి. నారాయణ నాయక్, అధ్యక్షులు బి. శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శి సాగర్, అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ శ్రీ నాదం, డిసిప్లినరీ కమిటీ ఛైర్మన్ జంపయ్య, ఉపాధ్యక్షులు సూరయ్య , ట్రెసరర్ ఎన్. నారాయణ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రాకేష్, రాజ్‌కుమార్, రమేష్, మంగులాల్, భరత్ కుమార్, మోతిలాల్ , కృష్ణ, పవన్, రాజు, స్వామి, గ్రామంలోని పలువురు పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, విద్యార్థులు, గామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

**చెన్నారావుపేట, జూన్ 7, ప్రభాతవార్త**

రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న ప్రైవేటు పాఠశాల ఫీజులను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని జాతీయ మానవ హక్కుల కమిటీ చెన్నారావుపేట మండల అధ్యక్షులు మంద నరేష్, ప్రధాన కార్యదర్శి నూనె తిలక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వ్యాపారమే పరమపారదిగా సాగుతున్న ప్రవేట్ విద్యా సంస్థల ధనదహనానికి సామాన్య మధ్యతరగతి తల్లిదండ్రులు బలైపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల పేరుతో ప్రైవేట్ స్కూల్ యజమాన్యులు తల్లిదండ్రులను మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని మండిపడ్డారు. విద్య ప్రమాణాలను పెంచడం పక్కనపెట్టి కేవలం లాభార్జనే ధ్యేయంగా విద్యా వ్యవస్థను నడుపుతున్నారని విమర్శించారు. స్కూల్ క్యాంపస్ లలో విగ్రహాలపై చర్యలు తీసుకోవాలి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యాశాఖ నిబంధనలను విరుద్ధంగా పాఠశాల ప్రాంగణంలోనే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, టై బెల్ట్, యూనిఫామ్ లను విక్రయిస్తూ ప్రైవేటు యాజమాన్యాలు దోపిడీకి తెరలేపాయని మంద నరేష్ నూనె తిలక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యునికి విద్యను దూరం చేస్తున్న ఇటువంటి ధోరణిపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి తనిఖీలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

# నాచినపల్లి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**దుగ్గొండి, జూన్ 7, ప్రభాతవార్త**

మండలంలోని నాచినపల్లి హైస్కూల్‌లో 2007-08లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 70మంది విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముందుగా చదువులు చెప్పిన గురువులకు మెమెంటోలు, బోకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. 18 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని అప్యాయంగా పలకరించుకున్నారు. చదువులు నేర్చుకున్న తరగతి గదులను ఒకసారి తిరిగి గతంలో జరిగిన వాటిని ఒకసారి నెమరు వేసుకున్నారు. విద్యార్థులు వివిధ స్థాయిల్లో స్థిర పడ్డారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, సోమదాసు, రాములు, శ్రీనివాసచారి, కమీషనర్, సత్యనారాయణ, విద్యార్థులు, దివ్య, నర్మద, కళ్యాణి, శృతి, వాణి, సునిత, సుగుణ, అశ్విని, లక్ష్మణ్, మహేందర్, రాజు, భరత్, నరేష్,



రమేష్ నాగరాజు, రాజేందర్‌లు పాల్గొన్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు

**చెన్నారావుపేట, జూన్ 7, ప్రభాతవార్త**

మండలంలోని అక్కల్ చెడ గ్రామానికి చెందిన ముత్యం రాజుసుప్రియ దంపతుల కుమార్తె నూతన వస్త్ర ఫల అలంకరణ కార్యక్రమానికి గ్రామ సర్పంచ భూక్య బుజ్జి సురేష్‌లు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి చిన్నారి శ్రీకృతిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశెరు రాజేందర్, మాజీ సర్పంచ్ మహిళ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూటి పావని రమేష్, నాయకులు బాధవత్ పెద్ద వీరు, కరెడ్ల శివ, ఒంటరి అశోక్, కొత్త కొమురయ్య, మాజీ వార్డు సభ్యులు, పులిశెరు లక్ష్మి, ఈర్ల అనూష, వసంత, సరోజన, రాధిక తదితరులు పాల్గొన్నారు.






## తిమ్మంపేట హైస్కూల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



**దుగ్గొండి, జూన్ 8, ప్రభాతవార్త**

ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ చెట్టు క్రింద కలుసుకున్న వేళ. మండలంలోని తిమ్మంపేట హైస్కూల్‌లో 1999-2000లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన 55మంది విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువులు చెప్పిన గురువులకు బోకేలు, మెమోంటో శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. 26 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. చదువులు నేర్చుకున్న తరగతి గదులను ఒక్కసారి తిరిగి నెమరు వేసుకున్నారు. గతంలో జరిగిన వాటిని మరోసారి గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు వివిధ స్థాయిలో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా కొప్పుల శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కలుసుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శోభ, కల్పన, మాధవి, అనిత, పద్మ, రజిత, అశోక్, కిరణ్, మధు, చందు, సుమన్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## లెంకాలపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక



**నల్లబెల్లి, జూన్ 8, ప్రభాతవార్త**

లెంకాలపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటిని మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాలోత్ చరణ్ సింగ్, జిల్లా కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. లెంకాలపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులుగా మామిండ్ల పోషాలు, ఉపాధ్యక్షులు కోమాండ్ల రాంషా, కార్యదర్శి గాదం రవి, కోశాధికారులుగా నూటెంకి మొగిలి, గాదం కుమారస్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కీసరి శంకర్, ఉపాధ్యక్షులు కందికొండ నాగరాజు, కార్యదర్శిగా మామిండ్ల రాజు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్‌గా మేకల అనిల్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొలిపాక రఘుపతి, మాజీ సర్పంచ్ లు మామిండ్ల కొమురయ్య, కోమాండ్ల రంగయ్య, వార్డ్ మెంబర్స్ కందికొండ కృష్ణ, నానబోయిన స్వామి, గాదం కుమార్, గాదం రమేష్, సింగిరెడ్డి రవి, మాజీ ఉపాధక్షుడు కీసరి రవిలు పాల్గొన్నారు.

## గోదావరి నీటి సరఫరా రెండు రోజులు నిలిపివేత

**తుర్కపల్లి, జూన్ 7 ప్రభాతవార్త**

మండలం వెంకటాపురం గ్రామంలోని 700 ఎం ఎం, ఎం ఎం డి ఐ పైప్ లైన్ లో పెద్ద లీకేజీలు ఏర్పడిన కారణంగా మరమ్మత్తుల పనులు చేపట్టడం జరుగుతుందని మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజనీర్ కరుణా కరన్ తెలిపారు. ఈ మరమ్మత్తుల కారణంగా గోదావరి నీటి సరఫరాను 8 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేయడం జరుగుతుం దని తెలిపారు. దీనివల్ల జిల్లాలోని ఆలేరు (18) ఆత్మకూరు ( 12) భువనగిరి ( 1) మోటకొండూర్ (24) యాదగిరిగుట్ట (26) రాజాపేట (33) గుండాల ( 23) తుర్కపల్లి ( 5) మండలాల్లో గ్రామాల్లో, యాదగిరిగుట్ట దేవస్థానం, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ, ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం ( 142 )ఆవాసాలకు నీటి సరఫరా నిలిపివేయబడుతుందని అన్నారు.

# పట్టణాల తరహాలో నైన్ పాక గ్రామం

**నూతన సర్పంచ్ భాస్కర్**

**వినూత్న ఆలోచన**

**వాడల పేర్లతో బోర్డుల ఏర్పాటు**

**చిట్యాల, జూన్ 7 ప్రభాతవార్త :**

పట్టణాల తరహాలో గ్రామాలు రూపాంతరం చెందుతున్నాయి. గ్రామంపై, గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించిన మండలంలోని నైన్ పాక గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్ వినూత్న ఆలోచనకు పదును పెట్టారు. గ్రామానికి వచ్చే వారికి స్వాగతం నేమ్ బోర్డు తోపాటు ధన్యవాదముల పేర్లతో బోర్డులను ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 3వేల జనాభా ఉంది. 10 వార్డులు ఉన్నాయి. ప్రతి వాడకు దేవతల, దేవుళ్లతో



కూడిన బోర్డులను నామకరణం చేసి నిర్మించారు. గ్రామంలో ప్రధానంగా పురాతన ఆలయమైన శ్రీ సర్వతోభద్ర నాపాక దేవాలయం సుప్రసిద్ధంగా పేరుగాంచింది. ఆలయ దర్శనానికి నిత్యం ప్రజలు, భక్తులు ఇతర ప్రాంతాల నుండి వచ్చి దర్శనం చేసుకోవడం పరిపాటిగా మారుతుంది. ఆలయానికి వెళ్లి దారి సూచిక, తోపాటు వాడలకు జై భీమ్ కాలనీ, హనుమాన్ నగర్ కాలనీ, మణికంఠ, పంచముఖ ఆంజనేయ స్వామి, బృందావన కాలనీ, వినాయక, లక్ష్మీ ృ దేవర కాలనీ, యాదవ కాలనీ లాంటి బోర్డులను ఏర్పాటు చేసి గ్రామస్తులను ఆకట్టుకున్నారు. నిత్యం గ్రామంలో సంచరిస్తూ పారిశుద్ధం పై ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆశీస్సులతో గ్రామంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని సర్పంచ్ నక్క భాస్కర్ ప్రభాతవార్తతో తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా తమతో కలిసి రావాలని గ్రామస్తులను కోరారు. గ్రామ సమస్యల పరిష్కారం కోసం ధనవంతుగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సర్పంచ్ నక్క భాస్కర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.




## బి ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా శ్రీనివాస్

**భూపాలపల్లి, జూన్ 07, ప్రభాతవార్త**



సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం (బి ఎం ఎస్) రాష్ట్ర అధ్యక్షులుగా అప్పాని శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర మహాసభలు బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్త కాపు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా అనేక తీర్మానాలు ఆమోదించిన అనంతరం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్న అప్పాని శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ గా యాదగిరి సత్తయ్య, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గా వై సారంగపాణి, వైస్ ప్రెసిడెంట్ అరికాల ప్రసాద్, వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా వడ్డేపల్లి కుమారస్వామి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా జీవీ కృష్ణారెడ్డి, కార్యదర్శులుగా మాదాసి రవీందర్, రాగం రాజేందర్, రమేష్ సత్యారీ శ్రీనివాస్, పాంద్రాల మల్లేష్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పవన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా శ్రీనివాసరాజు, ఆకుల హరిన్, ప్రభాకర్, ఈర్ల సదానందం, యూ తిరుపతి, కోశాధికారిగా సతీష్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన అప్పాని శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి పరిశ్రమలో పనిచేస్తున్న గని కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కు చిత్తశుద్ధితో పనిచేస్తానని వారి హక్కుల సాధన కోసం ఎల్లవేళలా పాటుపడతానని ఈ సందర్భంగా వెల్లడించారు.

## మానవత్వాన్ని చాటుకున్న నైన్ పాక గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్

**రోడ్డు ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తరలింపు**

**చిట్యాల, జూన్ 7 ప్రభాతవార్త:**



మండలంలోని నైన్ పాక గ్రామ బతుకమ్మ కుంట వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి భూపాలపల్లి సింగరేణి కార్మికుడు సాయి కిరణ్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్ గ్రామస్తుల సహకారంతో గాయాల పాలైన సాయి కిరణ్ ను 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రికి తరలించి మన మానవ త్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## దారి విషయంలో వివాదం ఒకరిపై కత్తితో దాడి.

**చిట్యాల, జూన్ 7 ప్రభాతవార్త;**

మండలంలోని కొత్తపేట గ్రామంలో దారి విషయంలో జరిగిన వివాదంలో గ్రామానికి చెందిన ఎండి రాజ్ మహమ్మద్ పై అదే గ్రామానికి చెందిన చిగురు నరేష్ అనే వ్యక్తి ఆదివారం కత్తితో దాడి చేసి గాయపరిచాడు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిగురు నరేష్, ఎండి రాజ్ మహమ్మద్ ల మధ్య పొలం దారి విషయంలో గత కొంతకాలంగా వివాదం జరుగుతుందని తెలిపారు. పలుమార్లు గ్రామంలో పంచాయతీ నిర్వహించిన ఇద్దరి మధ్య వివాదం సర్దు అనగా లేదని చెప్పారు. ఈ క్రమంలో చెరువు మట్టి తరలిస్తుండగా ట్రాక్టర్ వరుస లో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు చెప్పారు. దీంతో ఆగ్రహించిన నరేష్ రాజ్ మామదిపై కత్తితో దాడి చేసి భుజంపై వేటు వేసినట్లు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ లో నరేష్ పై బాధితుడు రాజ్ మహమ్మద్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం రాజ్ మహమ్మద్ ను ఎంజీఎం తరలించినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు. కత్తితో దాడి చేసిన నరేష్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయినట్లు తెలుస్తుంది. ఈ విషయమై ఎస్సై పోచంపల్లి సతీష్ ను వివరణ కోరగా దాడి చేసిన విషయం వాస్తవమేనని, నిందితుడు నరేష్ పోలీస్ స్టేషన్ లొంగిపోయిన విషయాన్ని ధ్రువీకరించడం లేదు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**రామగిరి ప్రభాతవార్త:**

రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన బండి మధునమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఆదివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ పరామర్శించారు. మృతురాలు మదునమ్మ చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, మేదర బోయిన కుమార్ యాదవ్, కాపరబోయిన భాస్కర్, సల్పాల సదానందం, దామెర శ్రీనివాస్, కృష్ణ తదితరులు ఉన్నారు.

## ప్రజలను అప్రమత్తం చేసేందుకే కార్డెన్ సెర్చ్ ముఖ్య ఉద్దేశం

**-మంథని సీఐ బొల్లపల్లి రాజు**

**రామగిరి ప్రభాతవార్త:**

సమాజంలో నానాటికి పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో భాగంగా ప్రజలు అప్రమత్తం చేసేందుకు గ్రామాలల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు మంథని సీఐ బొల్లపల్లి రాజు పేర్కొన్నారు. రామగిరి మండలంలోని పన్నూరు గ్రామంలో ఆదివారం ఎస్సై తాడవేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు గ్రామంలో తనిఖీలను నిర్వహించారు. ఈ తనిఖీలో 78 బైక్ లను తనిఖీ చేసి 19 నంబర్ ప్లేట్లు లేని, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్ క్రైం, గ్రామాల్లోకి వచ్చే అనుమానిత వ్యక్తుల విషయంలో అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు ఐక్యమత్యంగా ఉంటూ శాంతియుతంగా మెలగాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. యువకులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి రవాణా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎవరైనా భూ కబ్జాలకు, భూ సంబంధిత గొడవల్లో పాల్గొని అమాయకులను మోసం చేస్తే కఠిన చర్యలుంటాయని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిందం మహేష్, ముత్తారం, మంథని ఎస్సైలు రవి కుమార్, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## అధైర్యపడవద్దు... అండగా ఉంటాం

**పెరిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి**

**ముత్తారం, ప్రభాతవార్త:**

అమెరికాలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలో ఉన్న లగిశెట్టి స్పందన కుటుంబానికి అండగా ఉంటామని పెరిక సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కందుల సంధ్యారాణి భరోసా కల్పించారు. ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని నాగార్జున కాలనీ నివాసముంటున్న లగిశెట్టి స్పందన తల్లిదండ్రులు లగిశెట్టి శ్రీనివాస్ సునీత దంపతులను పెరిక సంఘం నాయకులు ఆదివారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ అమెరికాలోని చికాగో నగరంలో మే 31న ప్రమాదశాత్తు మెట్రో స్టేషన్ పై భాగం 25 అడుగుల ఎత్తు నుంచి కింద పడి తీవ్ర గాయాల పాలై కోమాలో ఉన్న లగిశెట్టి స్పందనకు పెరిక సంఘం తరుపున అండగా నిలుస్తున్నామని, అధైర్యపడవద్దన్నారు. స్పందన త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షి ంచారు. దాతలు ముందుకు వచ్చి స్పందన కుటుంబానికి అండగా నిలవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యరకమంలో పెరిక సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు దుండె మల్లేష్, మాజీ ఎంపీపీ కందుల పోశం, పెరిక సంఘం స్టేట్ మాజీ ఉపాధ్యక్షులు లగిశెట్టి చంద్రమోళి, గుడిపేట అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, పెరిక సంఘం నాయకులు నల్లపు తిరుపతి తదితరులున్నారు.

## ప్రభుత్వ నిర్ణయాలతో కుంటుపడుతున్న చేనేత రంగం

**వేములపల్లిలో నిరసన.**

**మొగుళ్లపల్లి, జూన్ 7, ప్రభాత వార్త:**



ప్రభుత్వ నిర్ణయాల వల్ల చేనేత రంగం తీవ్రంగా కుంటుపడుతోందని శ్రీ భక్త మార్కండేయ చేనేత సహకార సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఆదివారం వేములపల్లి గ్రామంలో సంఘ అధ్యక్షులు కుసుమ రాజయ్య ఆధ్వర్యంలో సుమారు 60 మంది చేనేత కార్మికులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం నూతనంగా తెచ్చిన టెండర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు నేస్తున్న వస్త్రాలను టెస్కో (గినిలీదివీ) ద్వారా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి, సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని కాపాడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## వేములపల్లిలో ముగిసిన బాల్ బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంప్

**మొగుళ్లపల్లి, జూన్ 7, ప్రభాత వార్త:**



భూపాలపల్లి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, జిల్లా యువజన క్రీడల అధికారి అనుమతితో వేములపల్లిలో నిర్వహించిన 45 రోజుల బాల్ బ్యాడ్మింటన్ సమ్మర్ క్యాంప్ ఆదివారం ఘనంగా ముగిసింది. రిటైర్డ్ టీచర్ గుత్తికొండ సాంబయ్య కోచ్‌గా వ్యవహరించిన ఈ శిబిరం అత్యంత విజయవంతంగా పూర్తయింది. ఈ ముగింపు వేడుకల్లో గ్రామ సర్పంచ్ ఆరెల్లి రమేష్, వార్డు మెంబర్ చిరంజీవి, పిల్లల మల్లన్న, ప్రకాష్‌లతో పాటు సీనియర్ క్రీడాకారులు సారంగపాణి, అనిల్, శ్యామ్, గోపన్న తదితరులు పాల్గొన్నా రు. గ్రామీణ క్రీడాకారులకు ఈ అద్భుత అవకాశం కల్పించినందుకు జిల్లా యువజన క్రీడల అధికారికి గ్రామం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌లో పోలీస్ జట్టు ఘనవిజయం

గార్ల, జూన్ 7, ప్రభాతవార్త:




గార్ల మండల పరిధి మర్రిగూడెం శ్రీవేంకటేశ్వర స్వామి క్రీడా మైదానంలో ఆదివారం పోలీసులు, పాత్రికేయుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌లో 20పరుగుల తేడాతో పోలీస్ జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణిత ఓవర్లలో 107పరుగులు చేయగా గార్ల ఎస్సై సాయికుమార్ నైపుణ్యతను ప్రదర్శించి 52పరుగులతో అర్ధసెంచరీ సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. అనంతరం 108పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాత్రికేయుల జట్టు పోలీస్ టీం బౌలర్ల దాటికి 87పరుగులకే ఆల్ అవుట్ అయ్యారు. దీంతో పోలీస్ జట్టు 20పరుగుల తేడాతో విజయం సాధించింది. గార్ల,బయ్యారం సీఐ రవీందర్ బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు ముఖ్యం కాదని రెండు శాఖల మధ్య స్నేహం, సమన్వయం కోసం క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం

గార్ల, జూన్ 7, ప్రభాతవార్త:

మండలకేంద్రంలోని విశ్వశాంతి విద్యాలయంలో గత 20సంవత్సరాల క్రితం పదొవ తరగతి చదువుకున్న 2006-07పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై అపూర్వంగా ఆత్మీయంగా శ్రీకృష్ణతార ఫంక్షన్ హాల్‌లో



కలుసుకున్నారు. విద్యాలయ కరస్పాండెంట్ దుర్గాప్రసాద్, బీరవెల్లి సంజీవరెడ్డి, ప్రిన్సిపల్ వసువులేటి రమేష్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. విద్య నేర్పిన గురువులు రమేష్, శ్రీనివాసరావు, రమేష్, మునీర్, బ్రహ్మం, యాకుబ్ అలీ, విజయలక్ష్మి, నాగమణి, శోభ, నజీర్, లింగయ్య, సీతారత్నం, పరమేశ్వరి లను పూల జల్లులతో ఆత్మీయంగా స్వాగతం పలికి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమోంటోలతో గౌరవించారు. అనంతరం పూర్వ విద్యార్థులు చిన్ననాటి స్మృతులను మననం చేసుకుంటూ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్స్, ఆటపాటలతో అలరించారు. అనంతరం గురువులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు మహాసభలో చిన్నగూడూరు కవులు, కళాబృందాలకు సన్మానం

చిన్నగూడూరు, జూన్ 7, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమహేంద్రవరంలో ఈ నెల 6,7తేదీల్లో జరిగిన ఏడవ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలో చిన్నగూడూరు కవులు, కళాకారులను ఘనంగా సన్మానించారు. చక్కని ప్రదర్శన నిర్వహించినందుకు గాను గౌరవ అతిథులు చైతన్య రాజు, ప్రతాప్, భూషణం, పార్థసారథిల చేతుల మీదుగా చిన్నగూడూరు కవులు తొట్ల వెంకటలక్ష్మి, జక్కి నాగేశ్వర్, దాశరథి కళాబృందం సభ్యులు, పెద్దమ్మతల్లి కళాబృందం సభ్యులను ఘనంగా సత్కరించారు.



## డబ్బులు తీసుకొని ఇవ్వని వ్యక్తి ఇంటి ఎదుట బాధితుల ఆందోళన

బయ్యారం, జూన్ 7, ప్రభాతవార్త:



బయ్యారం మండలకేంద్రంలోని కైరంకొండ గణేష్ 200మంది గ్రామస్థుల దగ్గర నుండి సుమారు తొమ్మిది కోట్ల రూపాయలు తీసుకొని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఆదివారం గణేష్ ఇంటి ఎదుట బాధిత మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన తెలిపారు. బాధితుల తెలిపిన వివరాల ప్రకారం కూలి,నాలి చేసి కూడబెట్టుకున్న డబ్బులను వడ్డీల ఆశ చూపి డబ్బులు తీసుకొని ఇవ్వడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బులు అడిగితే డయల్ 100కు ఫోన్ చేస్తున్నాడని, అప్పులు ఇచ్చి మానసికంగా మనోవేదనకు గురై నలుగురు మృత్యవాత పడినట్లు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా డబ్బులు మాకు ఇప్పించాలని లేనియెడల ప్రాపర్టీని విక్రయించి డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. విషయం తెలిసిన ఎస్సై ప్రశాంత్‌బాబు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని బాధిత మహిళలకు నచ్చచెప్పి స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఎస్సై ప్రశాంత్‌బాబును వివరణ కొరగా విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎస్సై తెలిపారు.

## సావిత్రమ్మకు నివాళులు అర్పించిన నాయిబ్రహ్మణ సంఘం

గార్ల, జూన్ 7, ప్రభాతవార్త:



గార్ల మండలం నాయిబ్రహ్మణ సంక్షేమ సంఘం మాజీ మండల అధ్యక్షుడు మేడేపల్లి దుర్గాప్రసాద్ మాతృమూర్తి మేడిపల్లి సావిత్రమ్మ మృతిచెందగా సంఘం ఆధ్వర్యంలో ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంఘం మండల అధ్యక్షులు జంపాల సతీష్, నాయకులు వెంకన్న, వెంకటేశ్వర్లు, మాధవ్, వెంకటప్పయ్య, వీరన్న, రఘురాం, సైదులు, సొంబ, రాజశేఖర్, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

**-టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి**

మహబూబాబాద్ టౌన్, జూన్ 7, ప్రభాతవార్త:

మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు డిఎస్పి తిరుపతిరావు సూచనల ప్రకారం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలువురు రౌడీషీటర్లకు ఆదివారం టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చట్టానికి విరుద్ధమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, గౌరవప్రదంగా జీవించాలన్నారు. రౌడీషీట్ ఉన్న వ్యక్తుల కదలికలపై పోలీస్‌శాఖ నిరంతరం నిఘా ఉంచుతుందని భవిష్యత్తులో ఏవైనా నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్‌శాఖకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



**మహబూబాబాద్ వార్త**
మహబూబాబాద్, తొర్రూరు

## రాహుల్ ఆర్థిక సునామి వ్యాఖ్యలను ఖండించిన శ్రీనివాస్‌రావు

బయ్యారం, జూన్ 7, ప్రభాతవార్త:



దేశంలో త్వరలో 'ఆర్థిక సునామి' రాబోతుందని ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను ప్రకటించవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు తీవ్రంగా ఖండించారు. ఇవి కేవలం ప్రజల్లో భయాన్ని సృష్టించే ప్రయత్నాలను, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను తట్టుకొని పటిష్టంగా ఉందని స్పష్టం చేశారు. గతంలో దేశాన్ని ఆర్థిక ఒత్తిళ్ల నుండి కాంగ్రెస్ పార్టీ కాపాడిన వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని రాహుల్ ఆరోపించారన్నారు. గత దశాబ్దకాలంలో ఆర్థిక రక్షణ వ్యవస్థలను బీజేపీ బలోపేతం చేసిందని గుర్తుచేశారు. సునామి 2013లో వచ్చిందని ఇప్పుడు కాదని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ ఈ దేశంలో వినాశనాన్ని సృష్టిస్తే బీజేపీ దృఢంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారని తెలిపారు. రాహుల్ పదేపదే ఇలాంటి హెచ్చరికలు చేస్తూ దేశంలో అస్థిరత సృష్టించాలని చూస్తున్నారని తుమ్మల శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు.

## ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా తగ్గించాలి

**-సర్పంచ్ గుగులోతు ప్రేమలత**

బయ్యారం, జూన్ 7, ప్రభాతవార్త:



బయ్యారం మండలంలోని నర్సా తండా పంచాయతీలో పర్యావరణ పరిరక్షణపై ఆదివారం సర్పంచ్ గుగులోతు ప్రేమలత మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి తీవరమైన హాని కలుగడమే కాకుండా దీని వలన తెలియకుండానే క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి ప్రత్యమ్నాయంగా మొదుగు ఆకులతో తయారు చేసిన ఇస్తార్లను, పేపర్ గ్లాసులను వినియోగించాలని సూచించారు. ఇవి పర్యావరణానికి హానికరం కావని ఆరోగ్యపరంగా మేలు చేస్తాయని తెలిపారు. గ్రామంలో టీ గ్లాసులు, వాటర్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్లు, కవర్లు వంటి ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిర్మూలించేందుకు గ్రామస్తులంతా కలిసరావాలన్నారు. గ్రామస్తుల సహకారంతో పంచాయతీని అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు.

## తాత్కాలిక ప్రాతిపదికన ప్రైమరీ ఇన్ స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కారేపల్లి జూన్ 7 ప్రభాతవార్త

సింగరేణి మండలం ప్రభుత్వ పాఠశాలల్లో 202627 విద్యా సంవత్సరానికి ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయుటకు దరఖాస్తులు చేసుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి జయరాజ్ తెలిపారు. మండల పరిధిలోని టేకులగూడెం విశ్వనాథపల్లి పేరుపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేయవలసి ఉంటుందన్నారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందనివిద్యార్హతలుప్రీ ప్రైమరి ఇన్‌స్ట్రక్టర్ ఇంటర్మీడియట్ (10+2) ఉత్తీర్ణత.. ఎర్లీ చైల్డ్ ఎడ్యుకేషన్ లేదా ప్రైమరీ టీచింగ్ సంబంధిత శిక్షణ/కోర్సు పూర్తి చేసి ఉండాలి. అన్నారు. అభ్యర్థులకనీస వయస్సు: 18 సంవత్సరాలుగరిష్ట వయస్సు: 44 సంవత్సరాలు ఉండవచ్చు అన్నారుగౌరవ వేతనంప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్: 8,000/ప్రీప్రైమరీ ఆయా పోస్ట్ 7 వ తరగతి విద్యార్హత గౌరవ వేతనం 6000 ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం మెరిట్ ప్రకారం జరుగుతుందని తెలిపారు. వీటికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జూన్ 8, 9 ధవ తేదీలతో తో ముగుస్తుందన్నారు. మండల స్థాయి మెరిట్ జాబితా ఈనెల 10వ తేదీన ప్రకటించబడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదం 11వ తేదీన జరుగుతుందని ఎంపికైన అభ్యర్థుల జాబితా జూన్ 11వ తేదీన డి ఈ ఓ కార్యాలయంలో ప్రకటించబడుతుందని తెలిపారు. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కోరారు.

# బీఆర్ఎస్ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలి

**కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు.**

**పలు కార్యక్రమాల్లో పాల్గొన్న వైరా నియోజకవర్గం**

**బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోతు మనీషా లక్ష్మి.**

*ఏన్కూరు, జూన్ 07, ప్రభాతవార్త :*

పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని..పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైరా నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోతు మనీషా లక్ష్మి ౣ అన్నారు.మండలంలోని కాలనీ నాచారం. .కేసుపల్లి..శ్రీరాంపురం తం డా..ఎర్రబోడు తండా..గ్రామాలలో వైరా నియోజక వర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోతు మనీషా లక్ష్మి ౣ వి స్తృతంగా పర్యటించారు.ఏన్కూరు మండల పరిధిలోని కాలనీ నాచారం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు కాం గ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో ఆమె సమక్షంలో చేరారు.పార్టీలో చేరిన వారికి వైరా బిఆర్ఎస్ నాయకురాలు మనిషా లక్ష్మి ౣ మదన్ లాల్ బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం కేసుపల్లి గ్రామానికి చెం దిన గూగుల్ మోతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా..ఆమె దశదిన కార్యక్రమానికి బానోతు మనిషా లక్ష్మి ౣ హాజరై మోతి చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు.అదేవిధంగా మండల పరిధిలోని శ్రీరాం పురం తండా గ్రామంలో ఇటీవల ఆంగో శ్రీను మృతి చెందారు.శ్రీను ఇంటికి బానోతు మనిషా లక్ష్మి ౣ వెళ్లి కుటుంబా న్ని పరామర్శించి అండగా ఉంటానని ఆమె అన్నారు.అనంతరం ఎర్రబోడు తండా గ్రామంలో బానోతు మనీషా లక్ష్మి ౣ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మనీషా లక్ష్మి ౣ మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీ అ భివృద్ధి..బలోపేతానికి ప్రతి కార్యకర్త..నాయకులు.. సైనికుల్లా కృషి చేయాలని ఆమె అన్నారు.పార్టీ సిద్ధాంతాలను తెలంగాణ ప్రభుత్వం గతంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో బలంగా తీసుకు వెళ్లడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని ఆమె అన్నారు.మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచేలా స్థానికంగా నా యకులు కార్యకర్తలు కృషి చేయాలని ఆమె అన్నారు.బీఆర్ఎస్ అందించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సి న బాధ్యత నాయకులదేనని ఆమె అన్నారు.దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు తెలంగాణ లో అమలు చేశారని ఆమె తెలిపారు.వైరా నియోజకవర్గాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటూ ప్రతి కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఆమె అన్నారు.వైరా నియోజకవర్గంలో రాబోయేది బిఆర్ఎస్ పార్టీ అని నాయ కులు..కార్యకర్తలు అధైర్య పడద్దని ఆమె తెలిపారు.తన తండ్రి బానోతు మదన్ లాల్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని కార్యకర్తలకు ఆమె హామీ ఇచ్చారు.ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను మీ వెంట ఎల్లప్పుడూ ఉంటానని కార్యకర్తలకు ఆమె ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామపంచాయతీల స ర్పంచులు జా రా సాంబయ్య,బానోతు వెంకన్న,నాయకులు మల్లెంపాటికి మాధవరావు,మల్లెంపాటి హరిబాబు,అ జ్మీరా రైలు,చీటీ ముత్యం,గణేశుల బాబు,పుల్లయ్య,రంగయ్య, మాజీ సర్పంచులు,ఉప సర్పంచులు,తదితరులు పాల్గొన్నారు.

# మల్లెపూలవాగు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

## వాహనదారులకు తీవ్ర గాయాలు

*దమ్మపేట, జూన్ 7, ప్రభాతవార్త*

దమ్మపేట మండలం జగ్గారం పంచాయతీ పరిధిలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చెనువారిగూడెం నుండి పట్వారిగూడెం వెళ్లే దారిలోని మల్లె పూల వాగు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరు వాహ నాల చోదకులకు తీవ్ర గాయాలైనట్లు సమాచారం. గాయపడిన వారిని స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

ప్రమాదానికి ప్రధాన కారణాలు:

అతి వేగం: రెండు వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం.

ప్రమాదకర మలుపు: రహదారిలోని ఎస్‌టర్నింగ్ వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం.

దట్టంగా పెరిగిన చెట్లు, పొదలు: రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు, పొదలు దృష్టి అడ్డుకోవడం.

ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, పొదలను వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను జగ్గారం గ్రామస్థులు,

ప్రయాణికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇనుగుర్తిలో ఏకగ్రీవంగా అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షుడిగా గోపందాస్ కృష్ణ, కార్యదర్శిగా బేతమల్ల మనోజ్, కోశాధికారిగా పింగిళి శ్రీను**

*ఇనుగుర్తి, జూన్ 7, ప్రభాతవార్త:*

ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆదివారం అంబేద్కర్ యువజన సంఘం పట్టణ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామేల్, కార్యవర్గ





సభ్యుడు బెజ్జం ప్రేమ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియలో నూతన అధ్యక్షుడిగా గోపందాస్ కృష్ణ, కార్యదర్శిగా బేతమల్ల మనోజ్, కోశాధికారిగా పింగిలి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా చీదురు రాము, గాడుదల గణేష్, గుజ్జునూరి శ్రీకాంత్, చిట్టబోయిన క్రాంతి.. సహాయ కార్యదర్శులుగా అప్పుల అంజి, చిట్టబోయిన యాకయ్య, లింగాడపు జంపయ్య.. ప్రచార కార్యదర్శిగా గుజ్జునూరి నరేష్.. సాంస్క ృతిక కార్యదర్శులుగా పసునూరి జంపయ్య, నాగెల్లి మురళి బాధ్యతలు స్వీకరించారు. సలహాదారులుగా గుజ్జునూరి బాబురావు, బేతమల్ల చంద్రయ్య, బూర ఐలయ్య, మహంకాళి సలీం రామ్, తమ్మడపల్లి యాదగిరి, కార్యవర్గ సభ్యులుగా పెండ్లి మహేందర్, పప్పుల యాకయ్య, పప్పుల కుమారస్వామి ఎంపికయ్యారు. కాగా, కేవలం ఎస్సీ సామాజిక వర్గానికే పరిమితం కాకుండా చరిత్రలో తొలిసారిగా బీసీలకు సైతం కోశాధికారితో సహా ఇతర పదవుల్లో ఈ కమిటీలో ప్రాధాన్యం కల్పించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అంబేద్కర్ అందరివాడు అనే నినాదానికి ఈ నిర్ణయం సజీవ సాక్ష ్యంగా నిలిచిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోపందాస్ కృష్ణ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ, బాబాసాహెబ్ ఆశయ సాధనకు, ఆయన భావజాల వ్యాప్తికి కమిటీ సభ్యులందరి సహకారంతో నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చీన్య తండా సర్పంచ్ జాటోత్ హరిచంద్ నాయక్, చిన్నాల కట్టయ్య, బొబ్బిలి మహేందర్ రెడ్డి, సంఘం మాజీ అధ్యక్షులు పప్పుల వెంకన్న(108), పప్పుల వెంకన్న (టీచర్) తదితరులు పాల్గొన్నారు.

# గుట్ట మట్టి అమ్మకాలను అడ్డుకున్న గ్రామస్థులు

*కారేపల్లి.. జూన్ 7 ప్రభాత వార్త*

గోదాం నిర్మాణం కోసం గుట్ట మట్టిని త్రవ్వి సంబంధిత కాంట్రాక్టర్ అమ్ముకుంటున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు ఆదివారం జెసిబి మిషన్లను అడ్డుకున్నారు వివరాల్లోకెళ్తే.సింగరేణి మండల గుట్టకింద గుంపు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న గంగాదేవి గుట్ట వద్ద గోదాం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చే శంకుస్థాపన చేశారు అయితే గోదాం పేరుతో గుట్టను త్రవ్వి మట్టి నీ అమ్ముకుంటున్నారని ఉన్నారని గ్రామస్తులు జరుపుతు న్నారు.ప్రకృతిని పరవసింపజేసె గంగాదేవి గుట్టను నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని గ్రామస్థులు కన్నెర్ర చేశారు.అక్రమ మట్టి తోలకం ఆపకపోతే ఎంతటి పోరాటానికైనా సిద్ధం అవుతామని గ్రామస్థులు అంటున్నారు.అధికారులు జోక్యం చేసుకొని మట్టి దందా ఆపాలి అని కోరారు.ఎటువంటి అనుమతులు లేకుండా పట్టపగలు గుట్టను త్రవ్వి సదరు కాంట్రాక్టర్ మట్టిని అమ్ముకుంటుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఇప్పటి కైన మట్టి దందా ఆపకపోతే తహాసిల్దార్ ఆఫీస్ ముందు బైఠాయించి ఉద్యమం చేస్తామని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుట్టకింద గుంపు గ్రామ ప్రజలు పాల్గొన్నారు




# విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి

## ఏఈ పాండు నాయక్

*నరసింహుల పేట జూన్ 7 ప్రభాతవార్త*




గృహ వ్యవసాయ బావుల వద్ద వానకాలం సీజన్లో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ పాండు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద నాగారం స్టేజి గ్రామపంచాయతీ పరిధిలో ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా టీజీ ఎన్ పి డి సి ఎల్ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించి గ్రామంలో విద్యుత్ సమస్యలను ప్రజలను నేరుగా అడిగి తెలుసుకుని అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన 15 కెవి లైటింగ్ ట్రాన్స్ఫారం ప్రారంభించి అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మరియు గృహ అవసరాల కోసం ఐఎస్ఐ మార్కు కలిగిన మోటార్ స్టార్టర్లు మరియు విద్యుత్ పరికరాలను ఉపయోగించుకోవాలని విద్యుత్ లైన్లు ట్రాన్స్ఫారం లేదా విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు హరిలాల్ మధు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# ఫోటో గ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులుగా వెంకటరమణ

*నెల్లికుదురు జూన్ 7 ప్రభాత వార్త :*

మండల ఫ్రోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులుగా మండల కేంద్రంలో కడారి వెంకటరమణ ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు తోట సుభాష్ తెలిపారు ఆదివారం మండల కేంద్రంలో జరిగిన యూనియన్ ఎన్నికల్లో ఫోటో గ్రాఫర్లు పాల్గొని వెంకటరమణ ప్యానెల్ ను గెలిపించారని తెలిపారు ప్రధాన కార్యదర్శిగా బానోతు నరసింహ కోశాధికారిగా గుగులోత్ సైదులు ఎంపికైనట్లు వెల్లడించారు ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నాలుగవసారి అధ్యక్షులు గెలిపించిన సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పని చేస్తా అన్నారు అనంతరం గెలుపొందిన ప్యానెల్ సభ్యులు బాణసంచా పేల్చి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఐలయ్య శ్రీధర్ సోమనాథ్ అశోక్ నరేష్ సాయి వైకె తదితరులు ఉన్నారు



# ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగుతున్నారా....! జాగ్రత్త.

*ఏన్కూరు,జూన్ 07, ప్రభాతవార్త :*

నిద్ర లేచిన దగ్గర నుంచి పడుకునే వరకు ప్లాస్టిక్ లేకుండా మానవులకు ఏ పని కావడం లేదు.టీ..కాఫీ..ప్లాస్టిక్ క ప్పుల్లో తాగుతున్నాము.టీ త్రాగడం ఎవరికి ఇష్టం ఉండదు..కాస్త టైం దొరికితే చాలు..చాలామంది బయటకు వెళ్లి టీ తాగి వస్తారు.అయితే ఈ టీ త్రాగడం వలన మనసుకు కాస్త ప్రశాంతంగా అనిపించినా..ప్లాస్టిక్ కప్పులో టీ తాగ డం ద్వారా అనారోగ్యానికి కొనితెచ్చుకున్నట్లే అంటున్నారు నిపుణులు. ప్రస్తుతం ఏ హోటల్ లో చూసినా పేపర్ క ప్పులే దర్శనం ఇస్తుంటాయి.వేడి వేడి టీ..కాఫీ..త్రాగడం చాలా మందికి ఇష్టం.కానీ రోజుకు రెండు కప్పుల కంటే ఎ క్కువగా తాగడం అంత మంచిది కాదని వైద్యులు అంటున్నారు.పలు ప్రభుత్వ..ప్రైవేటు కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు టీ..కాఫీలు.. తాగడం వలన అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లు అని వైద్యులు అంటున్నారు.ఈ ప్లాస్టిక్ కప్పులు మన శరీరంపై తీవ్ర స్థాయిలో సైడ్ ఎఫెక్ట్ కూడా కలిగిస్తాయి.ప్లాస్టిక్ గ్లాసులో వేడివేడి టీ త్రాగడం వలన అ నారోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని..వేడి టీ పోయాగానే ప్లాస్టిక్ కరిగి అందులోని ప్రమాదకర రసాయనాలు మరియు వేలాది మైక్రో ప్లాస్టిక్ టీలో కలిసి పోతాయి.ఒక్కొక్క టీ కప్పులో సుమారుగా 25వేల మైక్రో ప్లాస్టిక్స్ ఉన్న ట్లు వైద్యులు కనుగొన్నారు.ఒక్కసారి వాడిపడేసే డిస్పోజబుల్ పేపర్ కప్పుల్లో రోజుకు మూడు 100 మిల్లి లీటర్ల చొప్పున టీ త్రాగడం వలన పేపర్ లేదా ప్లాస్టిక్ కప్పులో టీ తాగితే అతి సూక్ష్మమైన 75.000 ట్రైనీ ప్లాస్టిక్ పార్టిక ల్స్ ఒంటిలోకి చేరినట్లే.ఎందుకంటే 5వేల మైక్రాన్..పరిమాణ మైక్రో ప్లాస్టిక్ కణాలు100 ఎంఎల్ వేడి ద్రవంలోకి 15 నిమిషాల పాటు కాగితం కప్పుల్లో నివసిస్తాయి.దాని వలన సగటున రోజులు మూడుసార్లు టీ తాగే వ్యక్తి 75 వేల పైకి మైక్రో ప్లాస్టిక్ కణాలని తీసుకుంటాడని..దీనివలన అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని..ఈ ప్లా స్టిక్ కప్పులు మన శరీరంపై తీవ్ర స్థాయిలో సైడ్ ఎఫెక్ట్ కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు.ఇవి ఆరోగ్యానికిహానికరమైన దీర్ఘకాలిక సమస్యలను తెచ్చి పెడతాయి.హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది.ప్లాస్టిక్ కప్పులో వే డి..టీ..తాగడం ముఖ్యంగా గర్భిణీ మహిళలకు మంచిది కాదు.ఎందుకంటే అందులో ఉండే మెట్రోసోమిన్..బిస్మి నాల్ కెమికల్స్.. గర్భిణి ఆరోగ్యం తో పాటు పుట్ట బోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.డిస్పోజబుల్ ప్లా స్టిక్ కప్పుల్లో వేడి పానీయాలు త్రాగడం వలన..మనకు తెలియకుండానే ప్లాస్టిక్ కణాలు లోపలికి వెళ్లిపోతున్నా యి.దీని కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని..ఈ ముప్పు రెండు విధాలుగా ఉంటుందని నిపుణు లు అభిప్రాయపడుతున్నారు.క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్లాస్టిక్ గ్లాసులో టీ త్రాగడం వలన ప్లాస్టిక్ కరిగిన విషపదార్థాలు కడుపులోకి చేరి జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తాయి.దీనివలన కడుపులో నొప్పి..ఎసిడిటీ వంటి సమస్యలు వస్తాయి.వేడి టీ ప్లాస్టిక్ గ్లాస్ ను తాకినప్పుడు కంటికి కనిపించని మై క్రోప్ ప్లాస్టిక్ కణాలు పానీయంలో కలిసి పోతాయి.ఇవి రక్తం ద్వారా శరీరంలోకి ప్రధాన అవయవాలకు చేరి ఆరో గ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తాయి.ఈ విష రసాయనాల ప్రభావము నేరుగా కాలేయం..మూత్రపిండాలు..మరియు న రాలు వ్యవస్థపై పడుతుంది.ప్లాస్టిక్ లోని విషవాయువులు మరియు కణాలు క్రమంగా శరీరంలో చేరడం వలన రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది.ఒక్కసారి తాగి పడేసే వీలుండడంతో ప్లాస్టిక్ గ్లాసులకు ఆదరణ పెరిగింది.కానీ ఈ కప్పు ల్లోనే మనకు తెలియని విషం ఉంది.ఈ కప్పులపై తరచుగా సూక్ష్మజీవులు తిష్ట వేసి ఉంటాయని..నోటి లాలా జ లాల ద్వారా లోపలికి వెళ్లి పోతాయని అంటున్నారు.ప్లాస్టిక్ కప్పుల్లో లోపల ఓ లైనింగ్ ఉంటుంది.ఈ లైనింగ్ కార ణంగా కప్ వాటర్ ప్రూఫ్ లా పనిచేస్తుంది.దీంట్లోనే రసాయనాలు పర్యావరణంతో పాటు మనిషి ఆరోగ్యానికి సైతం పలు విధాలా హానిచేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.





## ఓటరు నమోదు, పార్టీ బలోపేతమే లక్ష్యం

### -- మాజీ ఎంపి వినోద్ కుమార్, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*

ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రజలందరికి ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత మనదని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం హుజురాబాద్ పట్టణంలో బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ఓటర్ నమోదు, బిఎల్ఏ విధులపై అవగాహనపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో కలసి బిఆర్ఎస్ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపి వినోద్ కుమార్ మాట్లాడుతూ... ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఓటర్ల లిస్టు సవరణ కార్యక్రమంలో భాగంగా నిజమైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడవలసిన బాధ్యత బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల పై ఉందన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియ పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, నిజమైన ఓటర్ల ను బిఎల్ఏలు నమోదు చేసే విధంగా చూడాలని అన్నారు. మృతి చెందిన వారి ఓటర్ల పేర్లను మాత్రమే తొలగించేలా చూసుకునే బాధ్యత మనందరి పై ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ పై ఓటర్ నమోదు కార్యక్రమం పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి ప్రజాస్వామ్య బలోపేతానికి కృషి చేయాలని అన్నారు.

**-- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి...**

**-- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...**

పార్టీ ఆదేశానుసారం హుజురాబాద్ నియోజకవర్గంలో నూతన సభ్యత్వాలను చేర్పించడం ద్వారా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం, ప్రతి బూత్ స్థాయికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరించి అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలని కోరారు.





## ఎంజీఎఫ్ డోనర్లకు సన్మానం

*గూడూరు, జూన్ 7, ప్రభాతవార్త*

గూడూరుకు చెందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ నుండి వాకర్స్ ఇంటర్నేషనల్ కు అనుబంధంగా ఉన్న మహాత్మా గాంధీ ఫెలోషిప్ (ఎంజిఎఫ్) కు సభ్యులుగా చేరిన ఇద్దరిని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ ఆదివారం ఘనంగా



సన్మానించారు. అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వాంకుడోత్ కొమ్మాలు నాయక్, అధ్యక్షుడు ముయ్యబోయిన వెంకన్న లు ఇటీవల ఎంజీఎఫ్ లో సభ్యత్వం తీసుకున్నారు. కాగా వాకింగ్ గ్రౌండ్ లో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాస్ గౌడ్ వీరిద్దరిని శాలువాలతో సన్మానించి మెమెంటోలు, బ్యాడ్జీలు ప్రధానం చేశారు. నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే ఎంజిఎఫ్ లో సభ్యులుగా చేరినందుకు వీరిద్దరిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముక్తవరం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఊకే లక్ష్మయ్య, మండల వెంకటేశ్వర్లు, కోశాధికారి బత్తుల శ్రీనివాస్, క్రీడా కార్యదర్శి పెనుక ప్రభాకర్, సహ కార్యదర్శి నూనావత్ వీరన్న, గౌరవ సలహాదారులు కన్న వెంకటేశ్వర్లు, బీరం వెంకట్ రెడ్డి, అయిలబోయిన వీరయ్య, కార్యవర్గ సభ్యులుచెవులపల్లి దేవేందర్ రావు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## బావిలో దూకి ఆత్మహత్య

*గూడూరు, జూన్ 7, ప్రభాతవార్త*

తల్లిదండ్రులు తనకు సెల్ ఫోన్ కొనివ్వలేదని మనస్థాపానికి గురైన ఓ పీజీ విద్యార్థిని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మట్టేవాడ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మట్టేవాడ గ్రామానికి చెందిన బొడ్డు రాములు కూతురు బొడ్డు ఇందు (22) పీజీ చదువుతోంది. తనకు మొబైల్ ఫోన్ కావాలని అడిగితే తల్లిదండ్రులు వద్దని వారించినందుకు మనస్థాపానికి గురైన ఇందు శనివారం రాత్రి బాత్రూంకు అని వెళ్లి కనిపించకుండా పోయింది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆమె ఆచూకీ కోసం తెల్లవార్లు వెతికే ప్రయత్నం చేశారు . కాగా గ్రామ శివారులోని వ్యవసాయ బావికి చెందిన యజమాని ఆదివారం మధ్యాహ్నం బావి దగ్గరకు వెళ్ళిన క్రమంలో బావిలో యువతి మృతదేహం ఉండడాన్ని గమనించి ఆ విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. అక్కడికి వెళ్లి చూసినవారు బావిలో పడి మృతి చెందింది ఇందు గా గుర్తించారు. కాగా తండ్రి రాములు ఫిర్యాదు మేరకు ఆదివారం సాయంత్రం కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపారు. ఈ సంఘటనతో మట్టేవాడ గ్రామంలో విషాదం నెలకొంది.



## భీంపల్లి గ్రామీణ వైద్యుడు వడదెబ్బతో మృతి -

*కమలాపూర్: ప్రభాత వార్త.*

భీంపల్లి గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు బండారి చంద్రమోళి (48) శుక్రవారం వడదెబ్బ బారిన పడి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను హుజరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సమయంలో పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఆయనను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం చంద్రమోళి మృతి చెందారు.

## రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

*గూడూరు, జూన్ 7, ప్రభాతవార్త*

గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లుగా నమోదయి ఉన్న వ్యక్తులకు సీఐ వినయ్ కుమార్ ఆదివారం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లకు ఆయన పలు సూచనలు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నేరాలకు పాల్పడకుండా సజ్జన పౌరులుగా జీవించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు, భూ వివాదాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే ప్రజలు కూడా ఎటువంటి నేర కార్యకలాపాలకు పాల్పడకుండా చట్టాలను గౌరవించాలని, గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా, జూదం, దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు సహకరించాలని సీఐ కోరారు.

# కార్మిక వ్యతిరేక విధానాల వల్లనే సింగరేణి కి నష్టాలు

**సింగరేణిని నిండా ముంచుతున్న ఏ ఐ టి యు సి, ఐ ఎన్ టి యు సి సంఘాలు**

**రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయిలను చెల్లించాలి**

**జాతీయ బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్తకాపు లక్ష్మారెడ్డి**





**భూపాలపల్లి, జూన్ 07, ప్రభాతవార్త**

తెలంగాణలో అతిపెద్ద భారీ పరిశ్రమ అయిన సింగరేణి సంస్థను పాలక ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల మూలంగా అధోగతి పాలు చేస్తున్నారని బిఎమ్ఎస్ జాతీయ బొగ్గు పరిశ్రమల ఇంచార్జ్ కొత్త కాపు లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా లాభాలను సాధిస్తున్న సింగరేణి సంస్థ లో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించడం వల్లనే నష్టాలు వస్తున్నాయని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం 29వ ద్వి వార్షిక మహాసభ పట్టణంలోని సింగరేణి కమ్యూనిటీ హాల్లో వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు తెలంగాణ రాష్ట్రంలోని 12 డివిజనల్ చెందిన సుమారు 500 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాతీయ నాయకులు కొత్తకాపు లక్ష్మారెడ్డి ఇతర నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సింగరేణి ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ప్రాతినిధ్య హోదాను దక్కించుకున్న ఐఎన్టీయూసీ పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. గుర్తింపు హోదాలో కొనసాగుతున్న ఏ ఐ టి యు సి సింగరేణి యాజమాన్యం కు, ప్రాతినిధ్య సంఘ హోదాలో పనిచేస్తున్న ఐ ఎన్ టి యు సి తెలంగాణలో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తొత్తుగా మారి కార్మిక హక్కులను పరిరక్షించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఓవైపు సింగరేణి యాజమాన్యం, మరోవైపు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గని కార్మికుల సమస్యలను పరిష్కరించలేని సమయంలో ఆ రెండు సంఘాలు దిక్కు తోచక కార్మికులను మభ్యపెట్టడం కోసం కేవలం ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపడుతున్నాయని దుయ్యబట్టారు. వాస్తవానికి ఆ రెండు సంఘాలకు కార్మిక సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి ఉంటే యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసి ఇచ్చిన హక్కులను సాధించి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలను పక్కనపెట్టి ఆ రెండు సంఘాలు సింగరేణి యాజమాన్యంకు, ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నాయని ఈ క్రమంలో గత మూడు సంవత్సరాలుగా సింగరేణి కార్మిక సమస్యలు పేరుకుపోయాయని దీంతో కార్మిక వర్గం ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో సమ్మె అంటూ కార్మికుల వద్ద పెడబొబ్బలు పెట్టి యాజమాన్యంతో చర్చలు జరిపిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టిసి కార్మికులకు ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ఆ రెండు సంఘాలు సైతం సింగరేణి యాజమాన్యం ఇచ్చిన ప్రలోభాలకు తలొగ్గి జేఏసీ తలపెట్టిన సమ్మెను నీరుగార్చిందని ఆరోపించారు. సింగరేణిలో కార్మికులతో పాటు కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు అనేకం ఉన్నప్పటికీ గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని, పని చేతగాక సమస్యలను పరిష్కరించడం విఫలమయి బి ఎం ఎస్ వంటి జాతీయ సంఘంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కోల్ ఇండియా పరిధిలో బొగ్గు గని కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి వేతనాల అమలులో భారతీయ మజ్దూర్ సంఘ్ బి ఎం ఎస్ కట్టుబడి పని చేస్తూ వారి హక్కుల సాధనకు కృషి చేస్తుందని, అదేవిధంగా కనీస పెన్షన్ విధానం ఇతర సదుపాయాలను కల్పించడానికి జాతీయ స్థాయిలో కోల్ ఇండియాలో పటిష్టమైన పోరాటాన్ని బి ఎం ఎస్ కొనసాగిస్తుందని ప్రకటించారు. సింగరేణి పరిశ్రమ పరిరక్షణ, కార్మిక హక్కుల సంరక్షణ కొరకు అహర్నిశలు కృషి చేస్తామని, సింగరేణి కార్మికులకు కోల్ ఇండియా మాదిరిగా అలవెన్సులుపై ఆదాయ పన్ను రియంబర్స్ మెంటు చెల్లించుటకు తమ సంఘం పనిచేస్తుందన్నారు. సింగరేణి పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య రాష్ట్ర ప్రభుత్వం నుండి రావలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలు సుమారు రూ. 51,149 వేలకోట్లు సింగరేణి సంస్థకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 12వ వేజ్ బోర్డు కొరకు ప్రత్యేకమైన కృషి బిఎంఎస్ చేస్తుందని జూన్ 30 తేదీ తో కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో జూలై 1 వ తేదీ నుండి 12వ వేజ్ బోర్డు ప్రారంభం అవుతున్నందున కోల్ ఇండియా యాజమాన్యం కమిటీ నిర్మాణానికి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం నివారణకు నిర్మూలనకు కార్యాచరణ మహాసభలలో చేస్తామని తెలిపారు, సింగరేణి సంస్థలో నూతన బొగ్గు గనుల ప్రారంభ దిశకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సింగరేణి సంస్థలో గతంలో నడిచిన కార్పొరేట్ మెడికల్ బోర్డును యధావిధిగా కొనసాగించాలని సూచించారు. వివిధ కారణాలతో విధుల నుండి తొలగించిన కార్మికులను ఒక అవకాశం కల్పించి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోలిండియా మాదిరిగా సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు ఐ పవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో అమలు చేయాలని అనీ కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు మాధవ నాయక్, యాదగిరి సత్తయ్య, సారంగపాణి, శ్రీనివాస్, వర్షా ఉడికే, భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షులు వెలబోయిన సుజేందర్, బ్రాంచి కార్యదర్శులు ఆర్ నర్సింగ్ రావు, అల్లం శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు లక్ష్మణ్, పని రమేష్, కొడాలి శంకర్, శ్రావణ్ కుమార్, బత్తుల స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కొత్తూరు మల్లేష్, తాండ్ర మొగిలి, సిహెచ్ ప్రవీణ్, కోశాధికారి మూల రఘుపతి రెడ్డి, కేంద్ర కమిటీ నాయకులు పాండ్రాల మల్లేష్ , సత్యారి శ్రీనివాస్, మూల రఘుపతి రెడ్డి, కొత్తూరు మల్లేష్, కటకం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి మాఫియా కోసం.. ప్రజాపాలన పతనం.!

**అధికారుల అలసత్వంపై ప్రజల ఆగ్రహంమట్టి మాఫియాపై చర్యలు ఎక్కడ?**

**ఫిర్యాదులు వినిపించినా పట్టింపు శూన్యం**

**ప్రజా సమస్యలపై నిండు నిరక్ష్యం**



**నడికూడ , జూన్ 07 (ప్రభత వార్త ):**

నడికూడ మండలంలో ప్రజా పాలనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రభుత్వ అధికా రులు జవాబుదారీతనాన్ని మరిచిపోతున్నా రనే చర్చ పెద్ద ఎత్తున వినిపిస్తున్నది. జీతాలకు మాత్రమే పరిమితమై ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలు ఆగ్రహజ్వాలలతో రగిలిపోతున్నారు. అధికారాలను అడ్డుపెట్టుకొని అడ్డగోలు వ్యహారాలకు నిలయంగా మారుతున్న పరిస్థితు లపై మండల వ్యాప్తంగా అసంతృప్తి వ్యక్రమ పుతున్నది. చెరువులు, కాలువలు. ప్రభుత్వ భూములు అక్రమ మార్గాల్లో దందాలకు కేంద్రాలుగా మారుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుల ముసుగులో మట్టి మాఫియా రెచ్చిపోయి. చెరువుల మట్టిని విక్రయిస్తూ లక్షల రూపాయలు సంపాదిస్తున్నా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని ప్రజలు మండిప డుతున్నారు. ఫిర్యాదులు అందుతున్నా స్పందన లేకపోవడం, అక్రమ వ్యవస్థలపై నిశ్శబ్దం పాటించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నది. ప్రజలు కట్టిన పన్నుల రూపంలో జీతాలు తీసుకుంటున్న అధికా రులు ప్రజలకే దూరమవుతున్నారనే ఆవేదన వ్యక్తమవుతున్నది. కార్యాలయాలకు వచ్చామా, వెళ్లామా, జీతాలు తీసుకున్నామా అన్నట్టుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ వ్యవస్థలపై బాధ్యత లేకుండా కొనసాగుతున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడ చూసినా నిరక్ష ్యం. పట్టింపులేని వైఖరి, స్పంద నలేని వ్యవస్థ కనిపిస్తున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోవద్దని అధికారులకు ఎవరు ధైర్యం ఇస్తున్నారనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. అక్రమాలు జరుగుతున్నా అడ్డుకట్ట లేకపోవడం, నిజనిజాలు వెలికి తీయకుండా వ్యవహరించడం, ప్రజా సమస్యలను నిరక్ష ్యం చేయడం పాలనపై అనుమానాలను మరింత పెంచుతున్నది. దోపిడి వ్యవస్థ అంతమవుతుందా లేక మరింత విస్తరిస్తుందా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.. నిరక్ష ్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ప్రభుత్వం దృష్టి సారించాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రజా సమస్యలపై స్పందించే పాలన తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ ముషీరాబాద్ డిపో నూతన డిపో కమిటీ ఎన్నిక

**రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అడ్మినిస్ట్రేషన్ గడ్డం తిరుపతి**

**జూన్ 07, ప్రభాతవార్త, హనుమకొండ టౌన్ :**



ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ముషీరాబాద్ డిపో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ( అడ్మినిస్ట్రేషన్ ) గడ్డం తిరుపతి స్థానిక ప్రభాతవార్తకు తెలియజేశారు. టి జీఎస్ ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంఠం కృష్ణ , కార్య నిర్వాహక అధ్యక్షులు వల్లూరి బాబు అధికార ప్రతినిధి పాకాల ప్రభాకర్ , రాష్ట్రా డిప్యూటీ జనరల్ సెక్రెట్రీ ఎం ఆనందం రాష్ట్ర, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ (అడ్మినిస్ట్రేషన్) గడ్డం తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కరిక సత్యనారాయణ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకాల ప్రభాకర్ సమక్షంలో ముషీరాబాద్ డిపో కమిటీని ఎన్నుకోవడం జరిగినది. అధ్యక్షులు గా కుమార్, డిపో కార్యదర్శి గా కె నర్సింగ్ రావు, కోశాధికారి రవి, వైస్ ప్రెసిడెంట్ గా నర్సింగ్ రావు, దశరథ్, పబ్లిక్ సీటీ సెక్రటరీ గా నాగరాజు, సలహా దారులుగా ఎం .యాదయ్య, ఏ. రవీందర్, ఎం ఎస్. రావు లను ఎన్నుకోవడం జరిగింది అని గడ్డం తిరుపతి స్థానిక ప్రభాత వార్త కు తెలియజేశారు. అనంతరం మెదక్ రీజినల్ సెక్రెటరీ బూడిద మొగిలి సంఘానికి చేసిన సేవకు గుర్తింపుగా మెదక్ లో ఆయన గృహాన్ని సందర్శించి వారు సంఘానికి చేసిన సేవకు గుర్తింపుగా వారి కుటుంబానికి సంఘం యొక్క మెమొంటోను అందించి వారిని వారి కుటుంబ సభ్యులను గౌరవించడం జరిగింది అని అన్నారు.